ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -120 | పేజీలు - 8 | వెల - 03/- | సోమవారం 17 ఆగస్టు 2026

# నేటి నుంచి అసెంబ్లీ




ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు..
మండలిలో హోరాహోరీ!
ప్రతిపక్ష నేత హోదా ఇవ్వలేదన్న కారణంతో అసెంబ్లీకి వైసీపీ దూరం
శాసనమండలిలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని జగన్ వెల్లడి
సభకు రావాలని వైసీపీ ఎమ్మెల్యేలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపు
మెగా డీఎస్సీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై మండలిలో చర్చకు వైసీపీ వ్యూహం

**అమరావతి ఆగస్టు 16 (రిపబ్లిక్ న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఉభయ సభలను సమావేశపర్చనున్నారు. అయితే, వైసీపీ.. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించడంతో ఈసారి కూడా సభ కూటమి సభ్యులతోనే జరగనుంది. ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ) హోదా నిరాకరణకు నిరసనగా తమ బహిష్కరణ కొనసాగుతుందని వైసీపీ ఇప్పటికే స్పష్టం చేసింది.
మరోవైపు, ఈ సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా ఎల్ నినో ప్రభావం, రైతుల సమస్యలు, అమరావతి రాజధాని నగర నిర్మాణమిగతా2లో...





# ఘనంగా జనని-సూర్యతేజ వివాహం..

- సతీసమేతంగా హాజరైన ఏపీ సీఎం చంద్రబాబు..
- ఆనందంతో ఏడ్చేసిన బండ్ల గణేశ్

**హైదరాబాద్,ఆగస్టు 16 (రిపబ్లిక్ న్యూస్) :**ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ ఇంట పెళ్లి బాజాలు మోగాయి. ఆయన కుమార్తె జనని వివాహం ఆదివారం హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్య తేజతో ఆమె ఏడడుగులు వేశారు. ఈ వివాహ వేడుకకు రాజకీయ, సినీ రంగాలకు చెందిన అగ్ర ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. నగరంలోని జేఆర్సీ కన్వెన్షన్ మిగతా2లో...

# చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం..

## రంగంలోకి పవన్ కల్యాణ్

చంద్రగిరి సమీపంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన
అప్రమత్తంగా ఉండాలని అధికారులకు పవన్ కళ్యాణ్ ఆదేశం
డ్రోన్లతో నిఘా, రాత్రి పూట గస్తీ పెంచాలని కీలక సూచనలు
పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందిస్తామని హామీ
పరిస్థితిని బట్టి హనుమాన్ బృందాలను మోహరించాలని ఆదేశం



# రష్యాతో బలపడుతున్న సంబంధాలు

## - పుతిన్‌కు ఉత్తర కొరియా అధినేత కిమ్ సందేశం



**ప్యాంగ్యాంగ్ ఆగస్టు 16 (రిపబ్లిక్ న్యూస్) ::** రష్యాతో సంబంధాలు మరింత బలపడుతున్నాయని ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ తెలిపారు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ లంగిపోయిన కారణంగా వలస పాలన నుంచి ఉత్తర కొరియా స్వాతంత్ర్యం పొందిన సంగతి తెలిసిందే. జపాన్ లంగుబాటుకు గుర్తుగా జరిగిన 81వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా కిమ్‌కు అభినందనలు తెలుపుతూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శనివారం ఓ సందేశం పంపారు.దీనికి కిమ్ సమాధానం ఇస్తూ సోవియట్ సైనికులు జపాన్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నప్పుడు స్నేహబంధం ఏర్పడిందని, అది మరింత మిగతా2లో...



# 'కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్' రద్దుపై నేడు నిరసనలు

## - బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

**హైదరాబాద్,ఆగస్టు 16 (రిపబ్లిక్ న్యూస్) :** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మిగతా2లో...



# ములుగు జిల్లా సమగ్ర అభివృద్ధి, గిరిజనుల సంక్షేమమే లక్ష్యం

తెలంగాణ ఆడబిడ్డ అంటూ సీఎం రేవంత్‌రెడ్డి కితాబు
మహిళా సంఘాలతో సీఎం ముచ్చట.. వాటర్ ప్లాంట్ ప్రారంభం
పోరాటాల ఫలితమే ములుగు జిల్లా : మంత్రి దనసరి సీతక్క
మేడారంలో ముఖ్యమంత్రి ముమ్మర పర్యటన

**ములుగు,ఆగస్టు 16 (రిపబ్లిక్ న్యూస్) :** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం ములుగు జిల్లాలో పర్యటించారు. మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ములుగు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మేడారంలో గిరిజన పూజారులు మిగతా2లో...

# నేడు సర్ ముసాయిదా విడుదల

## - సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాల స్వీకరణ
## - అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల



**హైదరాబాద్,ఆగస్టు 16 (రిపబ్లిక్ న్యూస్) :**స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో భాగంగా సోమవారం ముసాయిదా ఓటర్ జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లుకు గాను 2,64,87,214 మంది మిగతా2లో...

# రాష్ట్రంలో మంచి స్కూళ్లు, కాలేజీలు ఎందుకు ఏర్పాటు చేయలేదు? బండి



**హైదరాబాద్,ఆగస్టు 16 (రిపబ్లిక్ న్యూస్) :**భారత్ లో మంచి కాలేజీలే లేవని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అంటున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారు? అని రాష్ట్రంలో మంచి స్కూళ్లు, కాలేజీలు ఎందుకు ఏర్పాటు చేయలేదు? అని ప్రశ్నించారు. కెటిఆర్ వ్యాఖ్యలపై బండి సంజయ్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పదేళ్ల పాటు సరిపడా టీచర్లను నియమించలేదు? అని పదేళ్ల పాటు యూనివర్సిటీల్లో ఖాళీలను ఎందుకు భర్తీ చేయలేదు? అని బండి ప్రశ్నించారు. స్కూళ్లు బాగాలేవని కొన్నాళ్ల క్రితం మాజీ సిఎం కెసిఆర్ మనవడు చెప్పాడని, కాలేజీలు బాగా లేదని ఇప్పుడు కెసిఆర్ మనవరాలు చెప్తోందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు.

# తెలంగాణ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణనలో కులగణన చేపట్టింది: పొన్నం



**హైదరాబాద్,ఆగస్టు 16 (రిపబ్లిక్ న్యూస్) :**దేశవ్యాప్త కులగణనపై కేంద్రం మోసం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. తాము ఇది చేశామని చెప్పుకోవడానికి బిఆర్ఎస్ పార్టీకి ఏమీ లేదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జనగననపై కేంద్రం విడుదల చేసిన ప్రశ్నావళిలో బిసిల ప్రస్తావన లేదని, జనగణన పత్రంలో 40 ప్రశ్నలలో ఎస్సీ, ఎస్టీల ప్రస్తావన మాత్రమే ఉందని పొన్నం తెలియజేశారు. తెలంగాణ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణనలో కులగణన చేపట్టిందని పేర్కొన్నారు. రిజర్వేషన్లలో 50 శాతం సీలింగ్ ఎత్తివేసి ఒబిసిలకు న్యాయం చేయాలని, ప్రధాని నరేంద్ర మోడీ అప్పుడు ప్రకటన చేశారని, లెక్కల సేకరణకు వచ్చేసరికి విస్మరించారని పొన్నం విమర్శించారు. జనగణనపై కేంద్రం ఇచ్చిన సర్క్యులర్ ను సవరించాలని, దేశంలో మిగతా2లో...

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

# నేటి నుంచి అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

పనుల పురోగతి వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఈ అంశాలపై అధికారపక్షం తన వాదనను వినిపించనుంది.

**స్పీకర్ ఆహ్వానం.. వైసీపీ తిరస్కరణ**

సమావేశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం తెలిపారు. వైసీపీ సభ్యులు సభకు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే, సంబంధిత మంత్రుల నుంచి సమాధానాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై చర్చించడం, తమ నియోజకవర్గాల వాణిని వినిపించడం శాసనసభ్యుల బాధ్యత అని, జగన్ తో సహా వైసీపీ ఎమ్మెల్యేలందరూ సభకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో, అసెంబ్లీకి హాజరుకాని ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు చెల్లించాలని స్పీకర్ ప్రశ్నించారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించి, తగిన చట్టం తీసుకురావాలని కూడా ఆయన సూచించడం గమనార్హం.

**మండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం: జగన్**

అసెంబ్లీని బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలిలో ప్రజా సమస్యలపై గళం విప్పాలని వైసీపీ నిర్ణయించింది. పార్టీ శాసనసభ్యులతో ఇటీవల సమావేశమైన ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్, ఈ మేరకు ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష గొంతు నొక్కేందుకే చంద్రబాబు ప్రభుత్వం తమకు ఎల్ఓపీ హోదా ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు.

మండలిలో పార్టీకి ఉన్న సంఖ్యాబలాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ సూచించారు. మెగా డీఎస్సీ-2025పై చర్చించాలని ఆదేశించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేయాలని పార్టీ సభ్యులకు సూచించారు. దాదాపు 13 త్రైమాసికాలుగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.9,100 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.3,300 కోట్లను ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ అంశాలను కూడా మండలిలో బలంగా ప్రస్తావించాలని జగన్ స్పష్టం చేశారు. దీంతో, అసెంబ్లీలో చర్చ ప్రశాంతంగా సాగినా, శాసనమండలిలో మాత్రం అధికార, విపక్షాల మధ్య వాడివేడి వాతావరణం నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి.

# చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం..

**రంగంలోకి పవన్ కల్యాణ్**

**చంద్రగిరి సమీపంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన**

**అప్రమత్తంగా ఉండాలని అధికారులకు పవన్ కళ్యాణ్ ఆదేశం**

**డ్రోన్లతో నిఘా, రాత్రి పూట గస్తీ పెంచాలని కీలక సూచనలు**

**పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందిస్తామని హామీ**

**పరిస్థితిని బట్టి హనుమాన్ బృందాలను మోహరించాలని ఆదేశం**

**అమరావతి**

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రవారిపాలెం మరియు సమీప గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచారం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఈ ఏనుగులు రాత్రివేళల్లో పంట పొలాలపై పడి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ విషయంపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు.

ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. డ్రోన్ల సహాయంతో ఏనుగుల సంచార మార్గాలను గుర్తించి, ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీప గ్రామాల ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలు పొలాల వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్థానిక సమాచార వ్యవస్థలు, మైకులు, మొబైల్ సందేశాల ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని తెలిపారు.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం మన ప్రథమ కర్తవ్యం. ఏనుగుల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. క్షేత్రస్థాయి సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. అవసరమైతే, ప్రజల భద్రత కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన 'హనుమాన్' (H.A.N.U.M.A.N ... Healing and Nurturing Units for Monitoring, Aid and Nursing of Wildlife ) బృందాలను సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరించాలి" అని అధికారులకు స్పష్టం చేశారు.

ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు రూపొందించిన వెంటనే, అటవీశాఖ నిబంధనల ప్రకారం బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా భయాందోళనలకు గురికాకుండా, ధైర్యంగా ఉంటూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ఏనుగులు కనిపించిన వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు ముమ్మరం చేశారు.

# ములుగు జిల్లా సమగ్ర అభివృద్ధి, గిరిజనుల సంక్షేమమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సాంప్రదాయ డోలు వాయిద్యాల నడుమ సీఎంకు ఘన స్వాగతం పలికారు. సమ్మక్క- సారలమ్మ గద్దెలను దర్శించుకున్న ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించి మొక్కులో భాగంగా నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అర్హులైన 24 మంది వితంతువులు, ఒంటరి మహిళలకు ఒక్కొక్కరికి నెలకు రూ.2,016 చొప్పున చేయూత సామాజిక భద్రత పింఛన్ చెక్కులను సీఎం స్వయంగా అందజేశారు. మేడారానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో మొక్క నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు. ములుగు వేదికగా రాష్ట్రవ్యాప్తంగా రూ.16,007 కోట్లతో చేపట్టనున్న గ్రామీణ రహదారుల అభివృద్ధి పైలాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. దీని ద్వారా రాష్ట్రంలోని 2,145 రహదారులు (మొత్తం 7,448 కి.మీ) అభివృద్ధి చెందనున్నాయి. ములుగు జిల్లా కలెక్టరేట్ సముదాయ ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ములుగు జిల్లా సమగ్ర అభివృద్ధి, గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. మేడారం సమ్మక్క -సారలమ్మ దేవాలయాన్ని రామప్ప, వేయి స్తంభాల గుడి తరహాలో అద్భుతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మల్లూరు నరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి త్వరలో ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. జంపన్న వాగుపై చెక్‌డ్యామ్‌లు, స్నాన ఘట్టాల నిర్మాణం చేపట్టి సమగ్ర అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి కల్పించేందుకు జర్మన్, జపనీస్, కొరియన్ వంటి విదేశీ భాషల్లో ఉచిత శిక్షణ అందించడంతో పాటు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. **తెలంగాణ ఆడబిడ్డ అంటూ సీఎం కితాబు** ములుగు కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి సీతక్కపై ప్రశంసల జల్లు కురిపించారు. "తెలంగాణ ఆడబిడ్డ" అయిన సీతక్క ములుగు అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారంటూ ఆమె పనితీరును సీఎం ప్రత్యేకంగా కొనియాడారు. **ప్రజా ప్రభుత్వంలోనే అభివృద్ధి గత పాలకులపై మంత్రి సీతక్క విమర్శలు** గత పాలకులు ఎన్నికల సమయంలో కేవలం శంకుస్థాపనలు చేసి, ఆ తర్వాత నిధులు కేటాయించకుండా పనులను నిలిపివేశారని మంత్రి సీతక్క మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే నిలిచిపోయిన పనులను మళ్లీ ముందుకు తీసుకువెళు_న్నామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలు వాటిని నమ్మవద్దని మంత్రి సీతక్క కోరారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి, స్వర్గీయ నల్లెల్ల కుమారస్వామి చేసిన పోరాటాల ఫలితంగానే ములుగు జిల్లా ఏర్పాటయిందని సీతక్క గుర్తుచేశారు. నేడు అదే జిల్లాను వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసే బాధ్యతను సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్నారన్నారు.

# లెబనాన్‌పై ఇజ్రాయిల్ భీకర దాడులు

**వైమానిక దాడుల్లో 11 మంది మృతి**

**హిజ్బుల్లా దాడులకు ప్రతీకారంగా దాడులు**

**లెబనాన్‌కు అండగా ఉంటామన్న ఇరాన్**



**నబాటిహ్ ,ఆగస్టు 16 (రిపబ్లిక్ న్యూస్) :**లెబనాన్‌పై ఇజ్రాయిల్ సైన్యం విరుచుకుపడింది. దక్షిణ లెబనాన్‌లోని వివిధ ప్రాంతాలపై భీకర వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 11 మంది మృతిచెందారు. మరో 19 మంది తీవ్రంగా గాయపడ్డారు. చనిపోయిన వారిలో ముగ్గురు చిన్నారులు ఉన్నట్టు అధికారులు తెలిపారు. హిజ్బుల్లా జరిపిన దాడుల్లో తమ దేశానికి చెందిన ముగ్గురు సైనికులు గాయపడినట్టు ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ప్రకటించిన లెబనాన్‌లోని నబాటిహ్ జిల్లాలో గల అన్సార్, డెయిర్ ఎజ్-జహ్రానీ ప్రాంతాలను ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు లక్ష్యంగా చేసుకుని శనివారం తెల్లవారుజామున విరుచుకు పడ్డాయి. అన్సార్‌లో ఒక నివాస గృహంపై జరిపిన క్షిపణి దాడిలో ముగ్గురు చిన్నారులతో సహా ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరు గాయపడ్డారు. అలాగే డెయిర్ ఎజ్-జహ్రానీలో జరిగిన మరో వైమానిక దాడిలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. 17 మంది తీవ్రంగా గాయపడినట్లు అంతర్జాతీయ మీడియా రాసుకొచ్చింది. లెబనాన్‌పై దాడులతో పాటు పౌరులు మృతి చెందిన విషయాన్ని ఇజ్రాయిల్ సైన్యం ధ్రువీకరించింది. అయితే, హిజ్బుల్లానే ఉద్దేశపూర్వకంగా ఆ సైనిక శిబిరాల్లో పౌరులను ఉంచిందని ఐడీఎఫ్ ఆరోపించింది. మృతి చెందిన మహిళలు, పిల్లలు ఒక సీనియర్ హిజ్బుల్లా కమాండర్ కుటుంబ సభ్యులని ఇజ్రాయిల్ మీడియా పేర్కొంది.

# ఘనంగా జనని-సూర్యతేజ వివాహం..

(మొదటి పేజీ తరువాయి)



సెంటర్‌లో జరిగిన ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన అర్ధాంగి నారా భువనేశ్వరితో కలిసి విచ్చేశారు.వారు నూతన వధూవరులు జనని, సూర్య తేజ వద్దకు వెళ్లి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తూ, బండ్ల గణేశ్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, తన కుమార్తె పెళ్లి వేడుకకు చంద్రబాబు సతీసమేతంగా రావడం పట్ల బండ్ల గణేశ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఓ దశలో ఏడ్చేశారు. దాంతో పక్కనే ఉన్న సీనియర్ నటుడు బ్రహ్మాజీ ఆయనను ఊరడించారు. కాగా, వరుడు సూర్యతేజ సీఎం చంద్రబాబు- నారా భువనేశ్వరిల చేతులమీదుగా తాళి అందుకుని వధువు మెడలో మంగళసూత్రధారణ చేయడం విశేషం. బండ్ల గణేశ్ కు సినీ, రాజకీయ రంగాల్లో మంచి సంబంధాలు ఉన్న నేపథ్యంలో, ఈ వివాహ వేడుకకు ఇరు రంగాలకు చెందిన నాయకులు, నటీనటులు, నిర్మాతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారి రాకతో వివాహ ప్రాంగణం సందడిగా మారింది. అతిథులను బండ్ల గణేశ్ దంపతులు సాదరంగా ఆహ్వానించి, వారి బాగోగులు చూసుకున్నారు. ఈ వివాహ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# రష్యాతో బలపడుతున్న సంబంధాలు

(మొదటి పేజీ తరువాయి)

బలపడి అన్ని రంగాలలో సహకారం కొనసాగుతోందని తెలిపారు. న్యాయం కోసం సాగించిన ఉమ్మడి పోరాట చరిత్రను, స్నేహబంధం యొక్క విలువైన సంప్రదాయాలను ముందుకు తీసుకుపోయిన ద్వైపాక్షిక సంబంధాల భవిష్యత్తుపై ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.విమోచన వార్షికోత్సవం సందర్భంగా సద్భావనా పర్యటన కోసం రష్యా నౌక 'పల్లాడా' ఉత్తర కొరియాలోని వాన్సాన్ ఓడరేవుకు చేరుకుంది. ఉత్తర కొరియా ప్రాంతీయ అధికారులు, రష్యా రాయబార కార్యాలయ సిబ్బంది ఆ నౌకకు స్వాగతం పలికారు. ఇదిలావుండగా శాంతియుత సహజీవనం కోసం ఉత్తర కొరియాతో చర్చలు జరపాల్సిన అవసరం ఉన్నదని దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ అభిప్రాయపడ్డారు.ఘర్షణల నివారణకు ఉభయ కొరియాల మధ్య రక్షణ చర్యలు అవసరమని సియోల్ విమోచనా దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయన అన్నారు. అయితే లీ అభిప్రాయంతో ఉత్తర కొరియా ఏకీభవించలేదు. అమెరికా-దక్షిణ కొరియా సైనిక విన్యాసాలు తనను రెచ్చగొట్టేందుకు ఉద్దేశించినవేనని విమర్శించింది.

# 'కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్' రద్దుపై నేడు నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర జనరల్ బాడీ సభ్యులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్ ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదనీ, తెలంగాణ పేద కుటుంబాల ఆడబిడ్డల ఆత్మగౌరవమని పేర్కొన్నారు. 2014 అక్టోబర్ 2న ఈ పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి బీఆర్ఎస్ హయాంలో 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందిందన్నారు. కోవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలోనూ పథకాన్ని ఆపలేదని గుర్తు చేశారు. కల్యాణలక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై కేటీఆర్ మండిపడ్డారు. నాలుగుసార్లు గడువిచ్చినా ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశ్యంతోనే కోర్టులో కౌంటర్ దాఖలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని ప్రజలకు తెలియజేసేందుకే నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్టు వివరించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుని ఆందోళనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# నేడు సర్ ముసాయిదా విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి నిర్దేశిత గడువు ఆగస్టు 10 వరకు ఎన్నికల సంఘానికి అందజేశారు. అందులో 2002 సర్‌తో మ్యాపింగ్ కాని 89.88 లక్షల మంది, పేరు, ఇంటి పేరు, ఇతర తేడాలతో పాటు సరైన పత్రాలు అందజేయని దాదాపు 50 లక్షల మంది ఓటర్లు కూడా ఉన్నారు. జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు ఎన్యూమరేషన్ల పంపిణీ, వాటి స్వీకరణ అనంతరం మొత్తం 73,39,234 ఓట్లను ఎన్నికల సంఘం తొలగించింది. అందులో మరణించిన వారు 9,22,230, శాశ్వతంగా వలస వెళ్లిన వారు 45,18,961, ఆచూకీ లభించని ఓటర్లు 11,25,546, ఇప్పటికే ఎన్‌రోల్ అయిన ఓటర్లు 6,70,203, ఇతరులు 1,02,294 మంది ఉన్నారు. నేటి నుంచి సెప్టెంబర్ 16 వరకు నెల రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అక్టోబర్ 15 వరకు ఓటర్ల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి, 19న తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది.

# తెలంగాణ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణనలో కులగణన చేపట్టింది: పొన్నం

(మొదటి పేజీ తరువాయి)

బిసిల జనాభా ఎంత ఉందో తెలుసుకునే ప్రశ్నను ఉంచాలని సూచించారు. దేశంలో ఎవరి జనాభా ఎంత ఉందో తెలిస్తేనే న్యాయం జరుగుతుందని, బిసి అయిన కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా స్పందించకపోవడం బాధాకరం అని పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు.

# ఏపీలో ఘోర ప్రమాదం..

**- కాలువలోకి దూసుకెళ్లిన కారు, ముగ్గురు మృతి, మరో ఇద్దరు గల్లంతు**

**అమరావతి :ఆగస్టు 16 (రిపబ్లిక్ న్యూస్) ::** ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం ఐతంపూడిలాకుల వద్ద విషాదం చోటు చేసుకుంది.ఓగిడి నుంచి తూర్పుగోదావరి జిల్లాలోని పెరవలిలో పెళ్లికి వెళ్లి వస్తుండగా నరసాపురం ప్రమాదవశాత్తు కారు కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు.వీరిలో లక్ష్మీభాను (18), నాగిరెడ్డి (18), వీరమల్లుకులసాయి (19) మృతదేహాలు లభ్యం కాగా మరో ఇద్దరు రాజారాం ( 17 ) , సాయిసూర్య(19) గల్లంతయ్యారు. వీరి కోసం గాలింపు చర్యలు మొదలు పెట్టారు. ఈ ప్రమాదం నుంచి ఒక యువకుడు సురక్షితంగా బయటపడ్డాడు. ఘటనపై ఏపీ మంత్రులు కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గల్లంతైన ఇద్దరి కోసం గాలింపు ముమ్మరం చేయాలని జిల్లా పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.**మరో ఘటనలో ఇద్దరు ..** పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం వేంద్ర కాలువలో ఈతకు దిగి మరో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. మృతులు భీమవరం, పార్వతీపురం మండల వాసులుగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు.

# పేదింటి పెళ్లికి కేశవరెడ్డి చేయూత

### మురళి వివాహానికి రూ.10 వేల ఆర్థిక సాయం




**శింగనమల/గార్లదిన్నె, ఆగస్టు 16,(రిపబ్లిక్ న్యూస్):** నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్న వారికి తనవంతు సహాయాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్, శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి అందించి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.

గార్లదిన్నె మండలం ఎర్రగుంట గ్రామానికి చెందిన ముత్యాలప్ప కుమారుడు మురళి వివాహం సందర్భంగా రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. నిరుపేద కుటుంబాల్లో వివాహ కార్యక్రమాలు నిర్వహించడం ఆర్థికంగా భారంగా మారుతున్న నేపథ్యంలో, అవసరమైన సమయంలో అండగా నిలవాలనే ఉద్దేశంతో కేశవరెడ్డి ఈ సాయం అందించారు. వివాహానికి సంబంధించిన ఖర్చుల విషయంలో కుటుంబానికి కొంతమేర ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ సహాయం ఉపయోగపడుతుందని తెలిపారు. పేద కుటుంబాల కష్టాలను దగ్గరగా చూసిన వ్యక్తిగా, వారి అవసరాలకు అనుగుణంగా తనవంతు సహకారం అందించడం బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చేయూత అందించడం ద్వారా వారి కష్టాల్లో కొంత ఉపశమనం కల్పించవచ్చని తెలిపారు. ముఖ్యంగా పేద కుటుంబాల్లో జరిగే వివాహాలు ఆర్థిక భారంగా మారకుండా తమవంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని చెప్పారు.

మురళి దంపతుల వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని కేశవరెడ్డి ఆకాంక్షించారు. నూతన దంపతులు ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని, కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా ఉండాలని శుభాకాంక్షలు తెలిపారు. వివాహ బంధంతో కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్న మురళి దంపతులకు భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.కేశవరెడ్డి అందించిన ఆర్థిక సహాయంపై మురళి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంట గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని వాజ్ పేయి వర్ధంతి వేడుకలు.





**రైల్వే కోడూరు ఆగస్టు 16 రిపబ్లిక్ న్యూస్.** భారత దేశ మాజీ ప్రధాని బిజెపి సీనియర్ నాయకులు నీతి నిజాయితీకి మంచి మానవత్వానికి కడిగిన ముత్యం రాజకీయంగా అజాతశత్రువు అందరూ మెచ్చిన అఖిలభారత ఆదర్శమూర్తి అటల్ బీహార్ వాజ్పేయి వర్ధంతి సందర్భంగా ఆదివారం ఓబులవారిపల్లి మండలం మంగంపేట పంచాయతీ ఆర్ఆర్ సెంటర్లో భారత మాజీ ప్రధాని ఏబీ వాజ్పేయి చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు గడ్డం చెంగల్ రాజు, ఓబులవారిపల్లి మండల బిజెపి అధ్యక్షులు ముక్కా రూపేష్ రెడ్డి శంకరయ్య ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు,ఈ సందర్భంగా చెంగల్ రాజు, రూపేస్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో మచ్చలేని వ్యక్తి మానవతా విలువలకు కట్టుబడిన మహనీయుడు మన దివంగత మాజీ ప్రధానివాజపేయి, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించడానికి భారతదేశం తరపున కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ప్రధాని మహానేత వాజ్పేయిని కాంగ్రెస్ ప్రభుత్వం పంపించడం జరిగినది ఆయన భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహనీయుడు అని ఆయన సేవలను కొనియాడారు నేడు బిజెపి పార్టీ దేశవ్యాప్తంగా అభివృద్ధి బాటలో నడుస్తుందంటే అది అటల్ బీహార్ వాజ్పేయి చేసిన సేవలేనని వారు అభినందించారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొని ఆయనకు పూలమాలవేసి నివాళులర్పించారు.

## ముక్కా రూపానందరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు.



**రైల్వే కోడూరు ఆగస్టు 16 రిపబ్లిక్ న్యూస్.** రాజంపేట పార్లమెంటు తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు బొబ్బే ధనుంజయ, కూడా చైర్మన్ తెలుగుదేశం పార్టీ రైల్వే కోడూరు అధ్యక్షుడు ముక్కా రూపానందరెడ్డిని మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిశారు, ఇరువురు నాయకులు రాజంపేట మరియు రైల్వే కోడూరు నియోజకవర్గాల రాజకీయ పరిస్థితులు స్థితిగతుల గురించి చర్చించుకున్నారు రెండు నియోజకవర్గాల్లో నాయకులను సమన్వయపరిచి అందరిని ఒకటి చేసి కార్యకర్తలు ఉత్తేజాన్ని ఉత్సాహాన్ని నింపి రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ఒకటిగా ముందుకు సాగాలని అందుకు నాయకులందరిని సమన్వయపర్చి ఒక తాటినందుకు తీసుకురావాలని బొబ్బే ధనుంజయ కోరారు ఈ విధంగా ముందుకు సాగాలని ఆయన కోరారు ఆయనతోపాటు రూపానందరెడ్డిని కలిసిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు .బైన వెంకటసుబ్బయ్య ,. వైకోట గ్రామ ఉప సర్పంచ్ కొట్టిడి సుబ్రహ్మణ్యంసీనియర్ నాయకులు కాంట్రాక్టర్ కోడి ప్రభాకర్ యాదవ్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నాగినేని సురేష్ యాదవ్ మైనారిటీ సీనియర్ నాయకులు షేక్ కరిముల్లా భాష ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు చెన్నూరు బాబు, సీనియర్ నాయకులు శ్రీరాములు తనయుడు సుధాకర్ యాదవ్,గ్రామ యువత గొబ్బె నరసింహ యాదవ్ ,బజారు రవి యాదవ్ . సీనియర్ నాయకులు కడియాల శేషయ్య,తెలుగుదేశం పార్టీ ఏజెంట్ కపిలయ్య గారి సుధాకర్ యాదవ్,బెంగళూరు టిడిపి పోరం సభ్యులు కోడు జయకృష్ణ యాదవ్,ఈశ్వర్ యాదవ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు



# ఆపద వేళల్లో భరోసా...

**సీఎంఆర్ఎఫ్ పేద కుటుంబాలకు అండ**

**రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత**

**గెలిపించిన ప్రజలకు ఏం చేసినా తక్కువే**

**రూ.54.39 లక్షల విలువైన చెక్కులు ఎమ్మెల్యే అందజేత**



**అనంతపురం/ రాప్తాడు, ఆగస్టు 16,(రిపబ్లిక్ న్యూస్):** పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ప్రాణాపాయ, దీర్ఘకాలిక వ్యాధులకు ఆపద వేళల్లో భరోసా కల్పిస్తుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఈ సందర్భంగాతనను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు ఏం చేసినా తక్కువేనని ఆమె అన్నారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధితో పాటు ఆపదలో ఉన్న వారికి వ్యక్తిగతంగా అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 52 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.54.39 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఊరటనిస్తోందని సునీత అన్నారు. గత రెండేళ్లలో రాప్తాడు నియోజకవర్గానికి చెందిన 1,430 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సుమారు రూ.11 కోట్ల మేర ఆర్థిక సహాయం అందినట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనంతగా పెద్ద ఎత్తున ప్రజలకు సహాయం అందుతోందని పేర్కొన్నారు.

నియోజకవర్గం నుంచి ఎవరైనా సీఎంఆర్ఎఫ్ సాయం కోసం తనను సంప్రదిస్తే వీలైనంత త్వరగా వారి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించడంతో పాటు కష్టకాలంలో అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. కార్యకర్తలు, నాయకులు ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని, వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే పరిటాల సునీతకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలు, మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పార్టీ నాయకులను ఆదేశించారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశమైన ఆమె డోర్ టు డోర్ కార్యక్రమం, ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు.ఇప్పటికే కార్యక్రమం ప్రారంభమై 20 రోజులు గడిచినా కొన్ని బూత్‌ల పరిధిలో ఇంటింటి కార్యక్రమం ఆశించిన స్థాయిలో జరగకపోవడంపై ఆమె ఆరా తీశారు. 100 ఇళ్ల కంటే తక్కువగా తిరిగిన బూత్‌లు, 50 శాతం కంటే తక్కువ పురోగతి ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలు



కచ్చితంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా అందజేసిన నోటీసులను పరిశీలించి అవసరమైన చోట వివరణలు ఇవ్వాలని సునీత సూచించారు. ఓటర్ల జాబితాలో తప్పులు, అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ ఓటు కోల్పోయిన వారి వివరాలను గుర్తించాలని, కొత్తగా ఓటు హక్కు పొందే అర్హులైన యువత నమోదు ప్రక్రియపైనా ప్రత్యేకంగా దృష్టి సారించాలని నాయకులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పార్టీ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించడంలో ప్రతి నాయకుడు, కార్యకర్త చురుగ్గా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి

### ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి -అసెంబ్లీ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు గళం విప్పాలి

**అనంతపురం సంక్షేమం, ఆగస్టు 16,(రిపబ్లిక్ న్యూస్):** ఎస్సీ, ఎస్టీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి ప్రత్యేక సంక్షేమ పథకాలను వెంటనే ప్రవేశపెట్టి, అవసరమైన నిధులు కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు గతంలో అమలైన సంక్షేమ పథకాలను పునరుద్ధరించడంపై అసెంబ్లీ సమావేశాల్లో ఆ వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు గళం విప్పాలని కోరారు.ఆదివారం అనంతపురం నగరంలోని దామోదరం సంజీవయ్య భవన్‌లో వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి సాకే హరి విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను అభివృద్ధి, చైతన్యం వైపు నడిపించేందుకు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సంక్షేమ పథకాలు అవసరమన్నారు. దళిత, గిరిజనులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ముందుకు రావాలంటే ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు.

గత ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పునరుద్ధరిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని సాకే హరి గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్ల పాలన దిశగా సాగుతున్నప్పటికీ ఇప్పటికీ పలు సంక్షేమ పథకాలు పునరుద్ధరించకపోవడం, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు తగిన నిధులు కేటాయించకపోవడం ఆ వర్గాలకు అన్యాయం చేయడమేనని విమర్శించారు.



గతంలో రద్దయిన 26 సంక్షేమ పథకాలను తిరిగి అమల్లోకి తీసుకురావడానికి ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని సాకే హరి డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.భూమి కొనుగోలు పథకం, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి, బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం, ఎన్ ఎస్ ఎఫ్ డి సి, ఎన్ ఎస్ కే ఎఫ్ డి సి పథకాలు, భూ అభివృద్ధి, స్టడీ సర్కిళ్లు, బుక్ బ్యాంక్ రుణాలు, కులాంతర వివాహాల ప్రోత్సాహకాలు వంటి పథకాలు అందుబాటులో లేకపోవడంతో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగులు, పేద కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. సంక్షేమ హాస్టళ్ల సంఖ్య, సదుపాయాలను కుదించడం వల్ల కూడా విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు.

**కార్పొరేషన్లు ఖాళీ కుర్చీలకే పరిమితం : సాకే హరి**

మాల, మాదిగ, రెల్లి తదితర కార్పొరేషన్లకు కేవలం చైర్మన్లను నియమించడం వల్ల ఎస్సీ వర్గాలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని సాకే హరి అన్నారు. నిధులు, అధికారాలు, కార్యాచరణ లేకపోతే కార్పొరేషన్లు కేవలం ఖాళీ కుర్చీలకే పరిమితమవుతాయని విమర్శించారు. సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించి, కార్పొరేషన్లకు ఆర్థిక వనరులు సమకూర్చాలని డిమాండ్ చేశారు.ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన విధానాన్ని ప్రకటించకపోతే ఆందోళన కార్యక్రమాలను చేపడతామని సాకే హరి హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కులు, సంక్షేమం కోసం సంఘాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు, ఎరుకుల సంక్షేమ సంఘం నాయకులు కావేటి ఉమామహేశ్వరి, భారతి, అంబేద్కర్ యువసేన నాయకుడు దేవేంద్ర, రవి, జేఏసీ నాయకులు నాగరాజు, ఆదాం, నాగన్న, రమణ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు కోడూరు మండల సమన్వయ కమిటీ కన్వీనర్ గా జాన్ ప్రసాద్ ఎన్నిక

## డంపింగ్ యార్డ్ దూరంగా తరలించాలని డిమాండ్.

**రైల్వేకోడూరు ఆగస్టు 16 రిపబ్లిక్ న్యూస్.** రైల్వే కోడూరు సిఐటియు సమన్వయ కమిటీ సమావేశం ఆదివారం సాయంత్రం సిఐటియు ఆఫీసులో, నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ నాయకులు సిహెచ్. చంద్రశేఖర్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు. కనుపర్తి కిరణ్ ముఖ్య అతిథులకు హాజరయ్యారు. గత కార్యక్రమాల సమీక్షించి, భవిష్యత్తు కర్తవ్యాలు రూపొందించారు. అనంతరం నూతన సమన్వయ కమిటీ, కన్వీనర్ గా పి. జాన్ ప్రసాద్, కో కన్వీనర్ గా, బి.రాజశేఖర్, లక్ష్మణ్, అంకయ్య, కమిటీ సభ్యులుగా, ఆనంద్, హరి నారాయణ, ముత్యాల శ్రీనివాసులు,లక్ష్మీకర్, కనపర్తి మణి, రవి, బద్రి, నరసింహ, తో పాటు,విద్యుత్తు, రెగ్యులర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, వివో ఏ, వీఆర్ఏ, బిల్డింగ్ యూనియన్, ట్రాన్స్పోర్ట్, సంఘాల నాయకులు పాల్గొన్నారు.కోడూరు పట్టణం, నరసరామ్ పేట, సిద్దేశ్వర థియేటర్ వద్ద గుంజన నదిలో డంపింగ్ యార్డ్, కోడూరు పట్టణంలోని చెత్తాచెదారం, వేయడం ద్వారా, గుర్తు తెలియని వ్యక్తులు, ప్రతిరోజు నిప్పు పెట్టడం, దాని ద్వారా కోడూరు పట్టణంలో పొగ తో నిండిపోవడంతో, కాలుష్యం కోరల్లో




కోడూరు మునిగిపోతుందని, దీనితో కోడూరు పట్టణ ప్రజలు, ఊపిరి ఆడక, వృద్ధులు పిల్లలు, ఆస్తమా, వంటి అనారోగ్యాలకు గురవుతున్నారని ప్రజలు , ఊపిరితిత్తులు గుండె జబ్బులకు లోనవుతున్నారని సమావేశం అభిప్రాయ పడింది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వెంటనే జోక్యం చేసుకోవాలని, పంచాయతీ రెవెన్యూ అధికారులు, ఊరి బయటకు డంపింగ్ యార్డ్ తరలించాలని, డిమాండ్ చేశారు. దీనిపైన ఆందోళన చేయాలని తీర్మానించారు. అదేవిధంగా స్మార్ట్ మీటర్లు పెట్టడంతో, విద్యుత్ బిల్లులు కలెక్షన్ చేసే కార్మికులను ఎస్పీడీసీఎల్ పరిధిలో 300 మందిని తొలగించారని, దీనికి నిరసనగా, 17, 18, తేదీల్లో తిరుపతి జిల్లా కేంద్రం ఎస్పీడీసీఎల్ ఆఫీస్ వద్ద 48 గంటల నిరాహార దీక్షలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనం, అవుట్ సోర్స్ కాంట్రాక్ట్, కార్మికుల రెగ్యులర్ కోసం, కార్మిక చట్టాలు పరిరక్షణ కోసం, కొనసాగింపుగా పోరాడాలన్నారు. అదేవిధంగా ఏపీఎండిసి పరిరక్షణ కోసం, బల్క్ టెండర్, రద్దుకు జరిగే, పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నరసరావుపేట, గుంజన్ నది, ప్రొటెక్షన్ వాళ్లు పని ప్రారంభించి పూర్తి చేయాలని, డిమాండ్ చేశారు. ఉద్యోగులు కార్మికులు సమస్యలపై ఐక్యంగా,సిఐటియు ఆధ్వర్యంలో బలమైన పోరాటాలు ఉద్యమాలు నిర్మించాలని, పిలుపునిచ్చారు.

# మహాశిల్పి బాల వీరాచారి శత జయంతి వేడుకలు

**ఆళ్లగడ్డలో శిల్పకళకు ఆద్యుడు -బాల వీరాచారి విగ్రహాలను ఆవిష్కరించిన కుమారుడు రామకృష్ణచారి**








**ఆళ్లగడ్డ ఆగష్టు 16 రిపబ్లిక్ న్యూస్**
ఆళ్లగడ్డ లోని శ్రీ శారద శిల్పకళా మందిరం ఆవరణలో ఆదివారం మహా శిల్పి ఆళ్లగడ్డ లో శిల్పకళను మొదలు పెట్టి ఈ రోజు ప్రపంచంలో ఆళ్లగడ్డ ను శిల్పకళకువేదిక చేసి ఎందరో శిల్పులకు జీవనోపాధి కల్పించి ఆళ్లగడ్డ పేరు దేశం నలుమూలల గుర్తుంచుకునే విదంగా తీర్చిదిద్దిన మహా శిల్పి ఆళ్లగడ్డకు ఈ రోజు శిల్ప కలలకు నిలయంగా రాష్ట్రం నలుమూలల నుండేకాక దేశ వ్యాప్తంగా మరియు విదేశాలనుండి కూడా దేవాలయాల నిర్మాణం కోసం ఆళ్లగడ్డ కు వస్తున్నారంటే అందుకు కారణం దురుగడ్డ బాలవీ రాచారి అంతటి మహనీయుడు, మహాశిల్పి దురుగడ్డ బాల వీరాచారి శతజయంతి వేడుకలుఆళ్లగడ్డ లోని వారి పెద్ద కుమారుడు రామకృష్ణచారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుమారులు డి. రామకృష్ణమాచార్యులు, రవీంద్ర చారి తమ తల్లితండ్రుల విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహా శిల్పి స్వర్గీయ బాల వీరాచారి పెద్ద కుమారుడు రామకృష్ణమాచార్యులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.తమ తండ్రి బాల వీరాచారి ఆళ్లగడ్డ లో శిల్ప కళల అభివృద్ధి కి విశేష కృషి చేశారని కొనియాడారు. గుంప్రమానిదిన్నె గ్రామంలో 1926 లో తమ తండ్రి జన్మించినట్లు తెలిపారు.

తమ తండ్రి బాల వీరాచారి ఆళ్లగడ్డలో శిల్పకళలకు ప్రాణం పోశారని ఈ రోజు ఎన్నో కుటుంబాలు శిల్పకళలతో ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఆయన తమ హయాంలో ఎన్నో అవార్డులు అందుకున్నారని, 1984వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు శ్రీ శారద శిల్పకళా మందిరాన్ని సందర్శించి బాలవీరచారి ప్రతిభ ను కొనియాడారని తెలిపారు. ఈ సందర్భంగా స్వర్గీయ బాల వీరాచారి జీవిత



చరిత్ర, విశేషాలతోకూడిన షార్ట్ ఫిల్మ్ ను డైరెక్టర్ బైరం లక్ష్మీ శేఖర్ తెరకు ఎక్కించిన షార్ట్ ఫిలిం ను కూడా ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో దురుగడ్డ వంశ కుటుంబ సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాజరైన ఆళ్లగడ్డ పట్టణ విలేకరులకు దురుగడ్డ కుటుంబ సభ్యులు సన్మానం చేశారు. అనంతరం వచ్చిన పురప్రముఖులకు, బంధుమిత్రులకు, శిల్పా చారులకు అందరికి విందు ఏర్పాటు చేశారు.తమ కుటుంబ ఆహ్వానం మేరకు హాజరైన ప్రతి ఒక్కరికి దురుగడ్డ రామకృష్ణచార్యులు కుటుంబం తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# భారీగా ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

**డిస్కవర్ అనిల్‌కుమార్ నేతృత్వంలో క్లీన్ ఉద్యమం**

**నగర నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి**

**"అనంతపురం మిషన్ క్లీన్" కు విశేష స్పందన**








**అనంతపురం సంక్షేమం, ఆగస్టు 16,(రిపబ్లిక్ న్యూస్):**
నగర పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు చేపట్టిన "అనంతపురం మిషన్ క్లీన్ " రెండో విడత కార్యక్రమం విజయవంతమైంది. హెచ్ఎల్‌సీ కాలనీ కాలువ వద్ద నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో 6 వేల కిలోలకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. డిస్కవర్ అనంతపురం, రోటరీ క్లబ్ అనంతపురం, ఆర్యన్ స్కూల్, అనంతపురం యూత్ ఫోరం, ఎస్ఆర్ డిఫెన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకులు ఏజీ అనిల్‌కుమార్ నాయకత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

**వ్యర్థాలను తొలగించడంతో పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత**
ఇప్పటికే నిర్వహించిన తొలి విడతలో సుమారు 5 వేల కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అదే స్ఫూర్తితో రెండో విడతను మరింత విస్తృతంగా చేపట్టగా 6 వేల కిలోలకు పైగా వ్యర్థాలను సేకరించారు. రెండు విడతల్లో కలిపి 11 వేల కిలోలకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం విశేషం. కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను వేరు చేసి తొలగించడంతో పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత మెరుగుపడింది.

**ప్రజలతో కలిసి అధికారులు వ్యర్థాలను తొలగించడం**
కార్యక్రమంలో 12 ఏళ్ల చిన్నారుల నుంచి 70 ఏళ్ల సీనియర్ సిటిజన్ల వరకు 140 మందికి పైగా పాల్గొన్నారు. విద్యార్థులు, యువత, మహిళలు, సీనియర్ పౌరులు, స్వచ్ఛంద కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని కాలువను శుభ్రం చేశారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్, అధికారులు, సిబ్బంది హాజరై స్వయంగా పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్నారు. ప్రజలతో కలిసి అధికారులు వ్యర్థాలను తొలగించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**ప్రజా ఉద్యమంగా కొనసాగించడమే లక్ష్యం**
"అనంతపురం మిషన్ క్లీన్" ను కేవలం ఒక్కరోజు పారిశుద్ధ్య కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా కొనసాగించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. నగరంలోని పర్యావరణ, పారిశుద్ధ్య సమస్యలకు ప్రజల భాగస్వామ్యంతో పరిష్కారాలు చూపడమే ఉద్దేశమన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించడం, పరిశుభ్రమైన నగర నిర్మాణంలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయడంపై దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. రెండు విడతల్లో 11 వేల కిలోలకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం ద్వారా "అనంతపురం మిషన్ క్లీన్ " కు ప్రజల్లో లభిస్తున్న ఆదరణ స్పష్టమైంది. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పౌరులు, విద్యార్థులు, వాలంటీర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, భాగస్వామ్య సంస్థలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సత్ప్రవర్తనతో జీవించాలి...

**రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వారికి పోలీసుల కౌన్సిలింగ్**






**నంద్యాల క్రైం, ఆగస్టు 16, (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారిపై నిరంతరం నిఘా ఉంచడంతోపాటు వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. పోలీస్ అధికారులు కౌన్సిలింగ్ నిర్వహిస్తూ ఎలాంటి చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సత్ప్రవర్తనతో జీవించాలని, సమాజంలో బాధ్యతాయుతమైన మంచి పౌరులుగా మెలగాలని సూచించారు.అదేవిధంగా వారి కుటుంబ పరిస్థితులు, జీవనోపాధి, భవిష్యత్తు లక్ష్యాలు తదితర అంశాలపై వారితో మాట్లాడి, నేరాలకు దూరంగా ఉంటూ గౌరవప్రదమైన జీవనం సాగించాలని సూచించారు. యువతను నేరాల వైపు ప్రోత్సహించడం, వివాదాల్లో పాల్గొనడం, బెదిరింపులకు పాల్పడడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ పోలీసులు ఇచ్చిన సూచనలను బేఖాతరు చేసి ఎవరైనా తిరిగి చట్టవ్యతిరేక లేదా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించబోమని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత నేరచరిత్రను పక్కనపెట్టి ఇకపై సత్ప్రవర్తనతో జీవిస్తూ కుటుంబానికి, సమాజానికి ఉపయోగపడే విధంగా తమ జీవితాలను మార్చుకోవాలని సూచించారు. నేర నియంత్రణతో పాటు నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా వారిలో మార్పు తీసుకురావడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# ఆళ్లగడ్డ అభివృద్ధికి సహకరించండి

**ఆస్క్ అఖిల కార్యక్రమం హైదరాబాద్ లో**

**హైదరాబాద్ లో వున్న ఆళ్లగడ్డ ప్రజలు హాజరుకావలి ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ**




**ఆళ్లగడ్డ ఆగష్టు 16 రిపబ్లిక్ న్యూస్**
ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ఆగష్టు 23వ తేదీ ఆదివారం ఆస్క్ అఖిల కార్యక్రమాన్ని హైదరాబాద్ లో ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మాట్లాడుతూ ఆళ్లగడ్డ అభివృద్ధి కి హైదరాబాద్ లో వున్న ఆళ్లగడ్డ ప్రజలు సహకరించాలని
హైదరాబాద్‌లోని నా ఆళ్లగడ్డ కుటుంబ సభ్యులకు నా ఆత్మీయ నమస్కారం చదువు, ఉద్యోగాల రీత్యా మీరు నగరంలో ఉన్నా మీ ఆలోచనలు, మనసంతా సొంత ఊరి ఎదుగుదల గురించే తపిస్తున్నాయని నాకు తెలుసు. వివిధ రంగాల్లోని మీ ప్రతిభ మన ఆళ్లగడ్డ భవిష్యత్తును సరికొత్తగా తీర్చిదిద్దే అద్భుతమైన శక్తిగా మారే అవకాశం ఉంది. మన ఆళ్లగడ్డ సమగ్ర అభివృద్ధికి మీ సలహాలు, ఆలోచనలను నాతో నేరుగా పంచుకునేందుకు ASK AKHILA వేదికగా మీ ముందుకు వస్తున్నాను. రండి...
ఈ ఆగస్టు 23, ఆదివారం హైదరాబాద్‌లో అందరం ఒకే వేదికపై కలుద్దాం. మన ఆలోచనలతో మన ఆళ్లగడ్డను నిర్మించుకుందాంఅంటూ పిలుపునిచ్చారు.
పూర్తి వివరాల కోసం ఫోన్ చేయాల్సిన నెంబర్: 9993339350

## తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయ పోస్టులు భర్తీ

**మండల విద్యాశాఖ అధికారి శోభా వివేకావతి**

**ఆళ్లగడ్డ ఆగష్టు 16 రిపబ్లిక్ న్యూస్**
ఆళ్లగడ్డ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన Acadamic Instructor లను నియమించడానికి ప్రభుత్వము అనుమతి ఇచ్చిందని మండల విద్యాశాఖ అధికారి తెలియజేశారు.
పై పోస్టులకు ఆసక్తి మరియు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైనదని, దరఖాస్తుదారులు 16.8.2026 నుండి 21.8 2026 వరకు దరఖాస్తులను విద్యార్హతల జిరాక్స్ కాపీలతో మండల విద్యాశాఖ కార్యాలయం ,ఆళ్లగడ్డ నందు అందజేయవలెను. గడువు ముగిసిన తర్వాత దరఖాస్తులు స్వీకరించబడవని తెలియజేశారు .ఎంపిక కాబడిన ఎస్జిటిలకు 10,000 మరియు స్కూల్ అసిస్టెంట్లకు 12,500 గౌరవ వేతనం ఇవ్వబడును.అని ఎం ఈ ఓ తెలియజేశారు

## ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

**మండల అధ్యక్షులుగా మున్నా, కార్యదర్శిగా లతీఫ్**




**ఆళ్లగడ్డ ఆగష్టు 16 రిపబ్లిక్ న్యూస్**
ఎస్ఎఫ్ఐ ఆళ్లగడ్డ జనరల్ బాడీ సమావేశంలో ఎస్ఎఫ్ఐ ఆళ్లగడ్డ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగాఎన్నకునట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్. నాయక్ తెలిపారు.మండల అధ్యక్షులుగా మున్నా , కార్యదర్శిగా లతీఫ్,ఉపాధ్యక్షులుగా విగ్నేష్, సంతోష్,జాన్ బాబు సహాయ కార్యదర్శులుగా సాగర్, దస్తగిరి, సాయి, కమిటీ సభ్యులుగా 11 మందితో నూతన మండల కమిటీగా ఎకిగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్ష, కార్యదర్శులు మున్నా,లతీఫ్ మాట్లాడుతూ మండలంలోని విద్యారంగ సమస్యలు విద్యార్థులపై అన్యాయం అక్రమ ఫీజులు వసూళ్లు విద్యార్థుల హక్కుల ఉల్లంఘటన సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని, ప్రభుత్వ విద్యారంగ రక్షణ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

## ఈశ్వరీ మహాదేవి జయంతి మహోత్సవం

**ఆళ్లగడ్డ ఆగష్టు 16 రిపబ్లిక్ న్యూస్**
రేపు 17వ తేదీన జగన్మాత శ్రీశ్రీశ్రీ ఈశ్వరీ మహాదేవి గారి 323వ జయంతి మహోత్సవం పురస్కరించుకొని ఆళ్లగడ్డ పట్టణంలోని విశ్వరూప నగర్ లో గల శ్రీ శ్రీ శ్రీ కాళికా మాత దేవస్థానము నందు కాళికా మాత అమ్మవారికి, గోవిందాయ మాంబా సమేత శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారికి మరియు మాతా ఈశ్వరీదేవి గార్లకు ఉదయం పంచామృతాభిషేకం, తీర్థప్రసాద వినియోగం నిర్వహించబడునని కావున భగవత్ భక్తులు ఈ కార్యక్రమం నందు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి మాతా ఈశ్వరీదేవి వారి క్రృపకు పాత్రులు కాగలరని దేవస్థాన కార్యవర్గ కమిటీ వారు తెలియజేశారు.




## ఘంగా డాక్టర్ సర్ధార్ గౌతు లచన్న జయంతి

**చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన పోలీసులు**

**జాతీయ స్వాతంత్రోద్యమ యోధుడు ఆంధ్ర రైతోద్ధ్యమ రధ సారథి బడుగు బలహీన వర్గాల నాయకుడు**



**నంద్యాల క్రైం, ఆగస్టు 16, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ల ఆదేశాలమేరకు జిల్లా పోలీస్ కార్యాలయం నందు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకొని ఏఆర్ అడిషనల్ ఎస్పీ చిన్నికృష్ణ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో శ్రీకాకులం జిల్లాలో గౌతు లచ్చన్న ప్రజలందరికీ దిక్సూచిగా నిలిచారు.గౌతు లచ్చన్న ప్రజల పక్షాన ఎల్లప్పుడూ నిలబడ్డ మహనీయుడు. ఆయన జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకం."దేశ స్వాతంత్ర్యం కోసం మాత్రమే కాక, రైతుకూలీల సంక్షేమం కోసం చేసిన పోరాటం గౌతు లచ్చన్న మహోన్నత యక్తి అని కొనియాడారు. గాంధీ సిద్ధాంతాలను, మార్గాలను ఆదర్శాలను ఆకర్షితుడై స్వాతంత్ర పోరాటంలో భాగంగా అనేక ఉద్యమాల్లో పాల్గొని జైలుకు వెళ్లారని నిజాయతి పరుడైన మంచి రాజకీయ నాయకుడిని అనేక మార్లు లోక్ సభకు ఎన్నికయ్యారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీతో పాటు సురేష్ ,బాబు, రిజర్వు సబ్ ఇన్స్పెక్టర్లు ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888



# రాయికల్ పట్టణంలో స్నేహం చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయాన్ని ప్రారంభించిన బి ఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి జీవన్ రెడ్డి





**రాయికల్ మండలం ఆగస్టు 16( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల్ జిల్లా రాయికల్ లో స్నేహం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ , అధ్యక్షులు సందెల విక్రమ్ ఆధ్వర్యం లో ఆఫీస్ను బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీమంత్రి టి జీవన్ రెడ్డి ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమానికి గౌరవ మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ టి. జీవన్ రెడ్డి, వైస్ చైర్మన్ తురగ సౌజన్య-శ్రీధర్రెడ్డి,, కౌన్సిలర్స్ రాకేష్ నాయక్, రాయికల్ పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎలిగేట అనిల్ కుమార్, మచ్చ శేఖరన్న,మాజీ కౌన్సిలర్ మ్యాకల రామేస్ ,కన్నాక మహేందర్ ,కడకుంట్ల నరేష్ ,తదితరులు పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా నిరుపేద కుటుంబానికి చెందిన మహిళా పెళ్ళికి సహకరశీతో పుస్తె మాట్టేలు పంపిణి చెయ్యడం జరిగింది, మరియు ఇంద్రనగర్ కాలనీ లో గల ప్రైమరీ స్కూల్ లో 40 మంది పిల్లలకు సరిపడా మంచి నీటికోసం వాటర్ ప్యూరి ఫై పెట్టించడం జరిగింది ఈ కార్యక్రమశీలో స్నేహం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బిఆర్ఎస్ నాయకులు పాల్గొనడం జరిగింది

# రాయికల్ పట్టణ విశ్వశాంతి పాఠశాలలో 80స్వతంత్ర దినోత్సవ వేడుకలు



**రాయికల్ మండలం ఆగస్టు,16( రిపబ్లిక్ న్యూస్)**



జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించరు ఈ కార్యక్రమంలో విద్యార్థినీవిద్యార్థులు వివిధ రకాలైన దేశభక్తి పాటలకు డ్యాన్సులు చేసి చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు.బోనాల పాటలకి విద్యార్థులు చేసిన డ్యాన్సులు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థినీవిద్యార్థులను అలరించడానికి స్కూల్ మేనేజ్మెంట్ వారి ఆధ్వర్యంలో ప్రత్యేకమైన మ్యాజిక్ షో నిర్వహించడం జరిగింది దీనిని చూసిన విద్యార్థులు అందరూ ఎంతో ఆనందోత్సహాలతో కేరింతలు కొట్టారు.

పాఠశాల ప్రిన్సిపల్ మచ్చ గంగాధర్ మాట్లాడుతూ ఈ రోజు మనందరికీ ఎంతో గర్వకారణమైన రోజు. ఎందుకంటే మన దేశం స్వాతంత్ర్యం పొందిన 80 ఏళ్ల ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ ఈ జాతీయ పండుగను జరుపుకుంటున్నాం.దేశ స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాల త్యాగాల ఫలితంగా సిద్ధించిన ఈ స్వాతంత్ర్యానికి నిజమైన సార్థకత చేకూరాలంటే మనమందరం మన పరంగా మన విధులను సక్రమంగా నిర్వహించడమే ఆ మహనీయులకు మనమిచ్చే నిజమైన గౌరవం.బ్రిటీష్ పాలన నుంచి విముక్తి పొంది 79 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, భారతదేశం శనివారం, ఆగస్టు 15 2026న తన 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడానికి సిద్ధమైంది. సాంప్రదాయం ప్రకారం, ఈ వేడుకలు ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట బురుజుల పైనుంచి ప్రధానమంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతినుద్దేశించి ప్రసంగించడంతో ప్రారంభమవుతాయి. దీంతో పాటు దేశవ్యాప్తంగా ఇళ్లు, కార్యాలయాలు, సోషల్ మీడియా వేదికల్లో త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేసే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది.

# ఆందోల్ మండల్,జోగిపేట పట్టణంలో నూతన ఆప్టికల్స్ షాప్ ఓపెనింగ్



**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 16**







గంజ్ ఎదురుగా క్లియర్ విజన్ ఆప్టికల్స్ షాప్ ప్రారంభం షకీల్ భాయ్ ఆహ్వానం మేరకు మున్సిపల్ చైర్మన్ ఎస్ కృష్ణ రెడ్డి వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు ) మహమ్మద్ యూసుఫ్, ఖురేషి టి వై జె ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ మైనార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ ఆబిద్, కో ఆప్షన్ మెంబర్ మహ్మద్ జి షాన్,మున్సిపల్ కౌన్సిలర్ కోషికే రాజశేఖర్ సీనియర్ నాయకులు 18 వార్డు అనిల్ కుమార్ 17 వ వార్డు సైలాన్ 9 వార్డు నాయకులు ప్రదీప్ గౌడ్ ఆత్మకమిటి డైరెక్టర్ ఖాలేదు ఇతర పెద్దలు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు

# జగిత్యాల్ నియోజకవర్గం లో పలు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**రాయికల్ మండలం ఆగస్టు,16( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల నియోజకవర్గం రాయికల్ మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన మెల్ల సౌమ్య మధు గార్లకు మరియు రాయికల్ పట్టణానికి చెందిన మద్దులపల్లి లావణ్య కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఈరోజు వారి గృహప్రవేశాలకు హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి అనంతరం ఆడపడుచులకు కట్నం గా చీరలను కానుకగా ఇచ్చిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ అలాగే జగిత్యాల పట్టణాశీ గాంధీనగర్ లోని పట్నంలో 14వ వార్డు చెందిన సర్దార్ ఖాన్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఈరోజు గురు ప్రవేశానికి కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఇల్లు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు వెంటనే కౌన్సిలర్ బొల్లారం గిరిధర్ కౌన్సిలర్లు నాయకులు తదితరులు ఉన్నారు జుక్త రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన మాడంపల్లి వినోద్ నరేష్ కుటుంబ సభ్యులు ఇంజనీర్లు మరియు కాగా ఈరోజు గ్రూప్ వేషాలు కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు అనంతరం ఆడపడుచు కట్టంగా చీరలు కానుక ఇచ్చిన చెక్కార సంస్థ సంజయ్ కుమార్ వెంట గ్రామ సర్పంచ్ మాజీ సర్పంచ్ ఉప సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే కి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు... వెంట.గ్రామ నాయకులు,మాజీ సర్పంచులు, ఉప సర్పంచ్ లు,ఎంపీటీసీలు, మండల, పట్టణ నాయకులు,సీనియర్ నాయకులు, నాయకులు, యూత్ నాయకులు ,తదితరులు ఉన్నారు..













# "కుటుంబంలో మార్పు సమాజంలో పరివర్తన దేశంలో అభివృద్ధి" అనే హిందూదేశ రక్షణకై యువత25 సంవత్సరాల లోపల వివాహం చేసుకుని-

**--కనీసం ముగ్గురు పిల్లలను కనాలి...పంచ పరివర్తనతోనే యువత దేశ నిర్మాణం, రక్షణలో కీలక పాత్ర పోషించాలి... ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ జీ..**

**రాయికల్ మండలం ఆగస్టు16( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కేంద్రంలో కండ స్థాయి యువ సమ్మేళనం రాయికల్ పట్టణంలో భక్త మార్కండేయ ఆలయం ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశానికి రాయికల్, మేడిపల్లి,భీమారం నుండి దాదాపు 276 మంది పాల్గొన్నారు

సందర్భంగా తెలంగాణ ప్రాంత ప్రచారం లింగం శ్రీధర్ జి మాట్లాడుతూ

వ్యక్తిలో మార్పు వచ్చినప్పుడే కుటుంబంలో, సమాజంలో, దేశంలో పరివర్తన సాధ్యమవుతుందని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ జీ అన్నారు. దేశ నిర్మాణం, రక్షణలో యువత కీలక పాత్ర పోషించాలని, సంఘ స్ఫూర్తితో క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా జగిత్యాల్ జిల్లా రాయికల్ ఖండ కేంద్రంలోని శ్రీ మార్కండేయ దేవాలయ ఫంక్షన్ హాల్లో ఆరవ ఉత్సవంగా యువ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన లింగం శ్రీధర్ జీ యువతకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మన పతనానికి మనమే కారణం. మనలో మార్పు వచ్చినప్పుడే దేశంలో మార్పు వస్తుంది" అన్నారు. కులం, ప్రాంతం, వ్యక్తిగత ప్రయోజనాలకు పరిమితం కాకుండా దేశం కోసం ఆలోచించే చైతన్యం యువతలో రావాలని సూచించారు. దేశానికి నష్టం




జరిగినప్పుడు ప్రతి ఒక్కరూ స్పందించే బాధ్యతను కలిగి ఉండాలన్నారు. సంఘ్ ప్రతిపాదిస్తున్న పంచ పరివర్తనలో కుటుంబ ప్రబోధన్, సామాజిక సమరసత, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ, పౌర విధులు ప్రధాన అంశాలని తెలిపారు. కుటుంబంలో ప్రేమ, ఆప్యాయత, పెద్దల పట్ల గౌరవం, పిల్లల్లో సంస్కారాలను పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం, సమాజంలో సోదరభావం పెంపొందించుకోవాలని అన్నారు. హిందూ సమాజ భవిష్యత్తు, కుటుంబ వ్యవస్థ బలోపేతం కోసం యువత బాధ్యతాయుతమైన కుటుంబ జీవనాన్ని స్వీకరించాలని, 25 ఏళ్లలోపు వివాహం చేసుకుని కనీసం ముగ్గురు పిల్లలను కనడం ద్వారా హిందూ దేశ రక్షణకు, హిందూ కుటుంబ వ్యవస్థకు బలం చేకూర్చాలని సూచించారు. వ్యక్తి



నిర్మాణం, క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక ఐక్యత కోసం డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ సంఘ్ శాఖను 1925 విజయదశమి రోజు ప్రారంభించారని తెలిపారు. యువతలో దేశభక్తి, సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందితేనే శక్తివంతమైన అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం సాధ్యమవుతుందని, విశ్వగురు స్థానంలో నిలుస్తుందని అన్నారు.

"కుటుంబంలో మార్పు సమాజంలో పరివర్తన దేశంలో అభివృద్ధి" అనే లక్ష్యంతో పంచ పరివర్తనను ప్రతి యువకుడు తన జీవితంలో ఆచరించి, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని లింగం శ్రీధర్ జీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో జిల్లా సహకార్యవాహ్ డాక్టర్ సాయిమధూకర్ జీ 276 మంది యువ సమ్మేళనం లో పాల్గొన్నారు.

# బహుజన ఉద్యమం బలపడాలంటే పార్టీ కమిటీ లే కీలకం

## బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్

**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 16**

కరీంనగర్:- బహుజన ఉద్యమం బల పడాలంటే బహుజన్ సమాజ్ పార్టీ అంతర్గత కమిటీ లే కీలకమని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ అన్నారు . ఈ రోజు కరీంనగర్ జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ సమీక్ష సమావేశం కి ఆయన జోన్ ఛీఫ్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ప్రతిమ మల్టిప్లెక్స్ దగ్గర రాష్ట్ర అధ్యక్షుడికి స్వాగతం పలికి ఫిలిం భవన్ వరకు ర్యాలీగా బయలుదేరారు. అక్కడ బహుజన పితామహులైన మహాత్మా పూలే , బాబాసాహేబ్ అంబేద్కర్ , మాన్యవర్ కాన్షీరామ్ గార్ల చిత్ర పటాలకు పూల మాల వేసి నివాళు లు అర్పించి అనంతరం హజరైన జిల్లా కమిటీ ని అసెంబ్లీ కమిటీలను సమీక్ష చేశారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ బహుజన ఉద్యమం బలోపేతం కావాలంటే బహుజన్ సమాజ్ పార్టీ కమిటీలు బలంగా నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీ ఆనాటి నాయకులైన గాంధీ నెహ్రూ, సర్దార్ వల్లాభాయ్ పటేల్ లు పదవ తరగతి చదివిన వారికి , రాజ కుటుంబాలకు, వంద ఎకరాల భూమి వారికి ఆస్తి పన్ను కట్టే వారికి ఓటు ఉండాలని అంటే బాబాసాహేబ్ అంబేద్కర్ ఇరవై ఒక్క సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయుడు కి ఓటు ఉండాలి ఆ ఓటు కు ఒకే విలువ ఉండాలని బ్రిటిష్ వారితో కాంగ్రెస్ వారితో పోరాటం చేసి బహుజనులతో పాటు అగ్రకులాలకు ఓటు హక్కు సంపాదించి పెట్టిన మహానాయకుడు అని తెలిపారు. కాంగ్రెస్ మనలను జంతువులుగా ఉంచాలని చూస్తే బాబాసాహేబ్ అంబేద్కర్ మనలను మనుషులుగా గుర్తింపు నిచ్చి బానిసలుగా ఉన్న మనలను రాజులను అయ్యే మార్గం వేశాడుని చెప్పారు. ఈ మహాపురుషుల సిద్ధాంతాలను పట్టుకోని మాన్యవర్ కాన్షీరాం గారు



బహుజన్ సమాజ్ పార్టీ ని స్థాపించి ఈ సిద్ధాంతం ఆధారంగా డబ్బు బలం ను , కుల బలం ని ఓడించి రాజ్యాన్ని సాధించి బెహన్ జీ గారిని ముఖ్యమంత్రి ని చేసిన పొలిటికల్ మెజీషియన్ మాన్యవర్ కాన్షీరామ్ అని అన్నారు.

### సామాజిక రాజకీయ సిద్ధాంతం అందిస్తేనే కమిటీలు నిరబడుతాయి

**అడ్వకేట్ నిషాని రామచంద్రం బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్**

సామాజిక రాజకీయ సిద్ధాంతం అందిస్తేనే కమిటీలు నిరబడుతాయి అని బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు. కమిటీలు నిర్మాణం కాకపోవడానికి రాజకీయ సిద్ధాంతం అందకపోవడం కమిటీ లలో ఉన్న కార్యకర్తలు బలంగా పని చేయాలంటే సామాజిక రాజకీయ సిద్ధాంతం అందించాలి అని అందుకు రాజకీయ శిక్షణ తరగతులు అవసరం అని అన్నారు . రాజకీయ శిక్షణ తరగతుల ద్వార వేలాది సంవత్సరాల చరిత్ర ను అందించడం వల్ల బహుజన ఉద్యమం బలోపేతం అవుతుందని అన్నారు. మనం అందరం పూలే అంబేద్కర్ సిద్ధాంతాలను బహుజన సమాజానికి అందించాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె ప్రశాంత్ గౌడ్ రాష్ట్ర కార్యవర్గ








సభ్యులు మాతంగి అశోక్ జోన్ ఇంచార్జ్ లు కల్లెపెల్లి రాజేందర్ దొడ్డే సమ్మయ్య లు పార్లమెంట్ ఇంచార్జి లు దొడ్డే శ్రీనివాస్ అక్కి బాలకిషన్ జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్ ఉపాధ్యక్షులు మంద సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు .

# వికెట్ కోసం తల్లడిల్లిన శ్రీలంక..



గాలె ఇంటర్నేషనల్ స్టేడియంలో శ్రీలంకతో మొదలైన తొలి టెస్టు మొదటి రోజు భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా మూడు సెషన్లలోనూ శ్రీలంక బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. రోజు ముగిసే సమయానికి భారత జట్టు 73 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసి అత్యంత పటిష్ట స్థితిలో నిలిచింది. కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్ మైదానంలో చూపించిన పట్టుదల లంక బౌలర్లను తీవ్రంగా దెబ్బతీసింది.యశస్వి రనౌట్.. పడిక్కల్ చారిత్రాత్మక సెంచరీటాస్ గెలిచి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత జట్టుకు ఓపెనర్లు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. ఐతే 47 పరుగుల వద్ద యశస్వి జైస్వాల్ 32 పరుగులు చేసి దురదృష్టవశాత్తూ రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత మూడో స్థానంలో క్రీజులోకి వచ్చిన దేవదత్ పడిక్కల్ బాధ్యతాయుతంగా ఆడాడు. లంక బౌలర్లపై విరుచుకుపడుతూ అద్భుత శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి పడిక్కల్ 131 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఆగు101 పరుగులు చేయగా, రెండో సెషన్‌లో 26 ఓవర్లలో వికెట్ పడకుండా 96 పరుగులు సాధించారు. ఆఖరి సెషన్‌లో 20 ఓవర్లలో వేగంగా 91 పరుగులు రాబట్టారు. శ్రీలంక బౌలర్లు రోజంతా ఒకే ఒక్క వికెట్ తీయడానికి తీవ్రంగా శ్రమించారు.అరంగేట్రం చేసిన ఆఫ్ స్పిన్నర్ కేశార నువాంత 21 ఓవర్లలో 98 పరుగులు సమర్పించుకుని వికెట్ ్ట 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున అంతర్జాతీయ టెస్టుల్లో సెంచరీ చేసిన తొలి భారతీయ బ్యాటర్‌గా ఆయన చరిత్ర సృష్టించాడు.కేఎల్ రాహుల్ సూపర్‌ఫామ్మరోవైపు సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ 77 పరుగులతో ఇన్నింగ్స్‌కు గట్టి పునాది వేశాడు. పడిక్కల్‌తో కలిసి రెండో వికెట్‌కు ఏకంగా 150 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఐతే జట్టు స్కోరు 197 పరుగుల వద్ద ఉన్నప్పుడు తీవ్రమైన కండరాల పట్టివేత కారణంగా రాహుల్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 16 పరుగులు చేసి ప్రభాత్ జయసూర్య బౌలింగ్‌లో అవుటయ్యాడు. ఆట ముగిసే సమయానికి రిషభ్ పంత్ 27 పరుగులతో పడిక్కల్ కాంబినేషన్‌లో క్రీజులో ఉన్నాడు.తొలి రోజు మూడు సెషన్లలోనూ భారత బ్యాటర్లు పరుగుల వర్షం కురిపించారు. మొదటి సెషన్‌లో 27 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 101 పరుగులు చేయగా, రెండో సెషన్‌లో 26 ఓవర్లలో వికెట్ పడకుండా 96 పరుగులు సాధించారు. ఆఖరి సెషన్‌లో 20 ఓవర్లలో వేగంగా 91 పరుగులు రాబట్టారు. శ్రీలంక బౌలర్లు రోజంతా ఒకే ఒక్క వికెట్ తీయడానికి తీవ్రంగా శ్రమించారు.అరంగేట్రం చేసిన ఆఫ్ స్పిన్నర్ కేశార నువాంత 21 ఓవర్లలో 98 పరుగులు సమర్పించుకుని వికెట్ దక్కించుకోలేకపోయాడు. ప్రభాత్ జయసూర్య 24 ఓవర్లలో 77 పరుగులిచ్చి గిల్ వికెట్ మాత్రమే తీసుకోలిగాడు. మొదటి రోజు లభించిన ఈ అద్భుత ఆరంభంతో టీమిండియా మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది. రెండో రోజు పడిక్కల్, పంత్ ఇదే ఊపును కొనసాగిస్తే శ్రీలంక ముందు భారీ స్కోరు ఖాయంగా కనిపిస్తోంది.

# రోహిత్ శర్మ రిటైర్మెంట్‌పై బీసీసీఐ బిగ్ అప్‌డేట్

ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్ చివరి మ్యాచ్‌లో రోహిత్ శర్మ అద్భుతమైన సెంచరీతో విమర్శకుల నోళ్లు మూయించారు. ఆ ఇన్నింగ్స్ తర్వాత కూడా 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆయన ఆడతారా లేదా అనే చర్చలు ఆగడం లేదు. హిట్ మ్యాన్ మళ్లీ మైదానంలో ఆడుతూ కనిపిస్తారా అనే ఆందోళన అభిమానుల్లో నెలకొంది. అయితే సెప్టెంబర్ 2026లో వెస్టిండీస్‌తో జరగబోయే వన్డే సిరీస్‌కు రోహిత్‌ను ఎంపిక చేయనున్నట్లు సమాచారం రావడంతో అభిమానులు పండగ చేసుకుంటున్నారు.మరో అవకాశం వెనుక అసలు వ్యూహంరోహిత్ శర్మ భవిష్యత్తుపై చీఫ్ సెలెక్టర్లు, బీసీసీఐ పెద్దల మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఆయనను జట్టు నుంచి తప్పించే కంటే తన సత్తా నిరూపించుకోవడానికి మరో అవకాశం ఇవ్వడమే సరైనదని నిర్ణయించారు. 2027 వరల్డ్ కప్ దృష్ట్యా వెస్టిండీస్ సిరీస్‌లో రోహిత్ ప్రదర్శన అత్యంత కీలకం కానుంది. ఆయన అనుభవం, ఆక్రమణ శైలి బ్యాటింగ్ జట్టు విజయాలకు ఎంతగానో ఉపయోగపడతాయని యాజమాన్యం భావిస్తోంది.రిటైర్మెంట్ పుకార్లకు చెక్ పెట్టిన సెంచరీఇంగ్లాండ్ పర్యటన సమయంలో రోహిత్ వన్డేలకు వీడ్కోలు చెప్తారనే వార్తలు పెద్ద ఎత్తున వినిపించాయి. యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వడం కోసం ఆయనను పక్కన పెడతారని, లార్డ్స్ వేదికగా జరిగిన మ్యాచ్ ఆయనకు చివరి వన్డే కావచ్చునని ప్రచారం జరిగింది. అలాంటి ప్రచారాలకు బ్యాట్‌తోనే సమాధానమిచ్చిన రోహి త్, క్లిష్ట సమయంలో సంచలన సెంచరీ సాధించి పెద్ద మ్యాచ్‌లలో తన ప్రాధాన్యత ఏంటో స్పష్టం చేశారు.ప్రతి సిరీస్ ఒక పరీక్షేసెలెక్టర్ల ఆలోచనలు ఎలా ఉన్నా, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా రోహిత్‌కు సపోర్టుగా నిలిచినట్లు వార్తలు వస్తున్నాయి. రోహిత్ భవిష్యత్తు ప్రణాళికల్లో ఉన్నంతవరకు జట్టులోనే కొనసాగుతారని ఆయన స్పష్టం చేశారు. రాబోయే ప్రతి సిరీస్‌లో రోహిత్ ఫామ్‌ను నిశితంగా పరిశీలించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ హిట్ మ్యాన్ కెరీర్‌కు ఎంతో ముఖ్యమైనదిగా మారనుంది.



# వడ్రా నువ్వు.. మా కపిల్ దేవ్ ఆల్ టైమ్ రికార్డునే బద్దలుకొట్టావ్‌గా!





ఆస్ట్రేలియాకు చెందిన నిప్పులు చెరిగే బౌలర్ మిచెల్ స్టార్క్ టెస్ట్ క్రికెట్‌లో అరుదైన మైలురాయిని చేరుకున్నారు. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ రెండో రోజు ఆటలో బంగ్లాదేశ్ బ్యాటర్ లిటన్ దాస్ వికెట్ తీయడం ద్వారా తన ఖాతాలో 435వ టెస్ట్ వికెట్‌ను జమ చేసుకున్నాడు. దీనితో భారత మాజీ కెప్టెన్, 1983 ప్రపంచకప్ విజేత కపిల్ దేవ్ (434 వికెట్లు) రికార్డును అధిగమించి చరిత్ర పుటల్లో తన పేరును లిఖించుకున్నాడు. 11వ స్థానానికి ఎగబాకిన ఆసీస్ స్పీడ్‌స్టర్టెస్ట క్రికెట్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో మిచెల్ స్టార్క్ 11వ స్థానానికి చేరుకున్నాడు. ఇప్పటివరకు 12వ స్థానంలో ఉన్న స్టార్క్, కపిల్ దేవ్‌ను వెనక్కి నెట్టి 11వ ర్యాంకును సొంతం చేసుకున్నాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి కపిల్ దేవ్ సమంగా నిలిచిన ఆసీస్ పేసర్, రెండో రోజు తొలి సెషన్ లోనే ఈ ఘనత సాధించాడు. శ్రీలంక దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ 800 వికెట్లతో ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.డాలే స్టేన్ రికార్డ్‌పై స్టార్క్ కన్నుకపిల్ దేవ్‌ను దాటేసిన స్టార్క్ తదుపరి లక్ష్యం సౌతాఫ్రికా ఫాస్ట్ బౌలింగ్ దిగ్గజం డాలే స్టేన్ రికార్డే. స్టేన్ తన టెస్ట్ కెరీర్‌లో 439 వికెట్లతో ప్రపంచంలోనే 10వ అత్యుత్తమ బౌలర్‌గా నిలిచారు. ఆ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి స్టార్క్‌కు కేవలం 5 వికెట్లు మాత్రమే అవసరం. ప్రస్తుతం స్టార్క్ ఉన్న సూపర్ ఫామ్ చూస్తుంటే ఈ సిరీస్‌లోనే స్టేన్‌ను అధిగమించి టాప్ 10లోకి అడుగుపెట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఆల్‌టైమ్ టెస్ట్ వికెట్ల వేటగాళ్లుప్రపంచ టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన టాప్ 15 బౌలర్లలో శ్రీలంక స్పిన్ దిగ్గజం మురళీధరన్ (800), షేన్ వార్న్ (708), జేమ్స్ అండర్సన్ (704), మన అనిల్ కుంబ్లే (619), స్టువర్ట్ బ్రాడ్ (604), నాథన్ లియోన్ (568), గ్లెన్ మెక్‌గ్రాత్ (563), రవిచంద్రన్ అశ్విన్ (537), కోర్ట్నీ వాల్ష్ (519), డాలే స్టేన్ (439) ఉన్నారు. వీరి సరసన ఇప్పుడు స్టార్క్ చేరడం అతని నిలకడైన టాలెంటుకు నిదర్శనం.

# మీరు క్రెడిట్ కార్డ్ ఉపయోగిస్తున్నారా? స్టేట్‌మెంట్ తేదీకి, చెల్లింపు తేదీకి మధ్య ఉన్న తేడా ఏంటి? ఒక్క తప్పుతో భారీ నష్టం!




క్రెడిట్ కార్డ్ ఉపయోగించే వారికి రెండూ చాలా ముఖ్యమైన తేదీలు. అయితే ఈ రెండు ఒకటేనని చాలామంది భావిస్తుంటారు. వాస్తవానికి వీటి మధ్య స్పష్టమైన తేడా ఉంది. ఈ తేడాను తెలుసుకోవడం ద్వారా వడ్డీ, ఆలస్య రుసుములు వంటి అదనపు ఖర్చులను నివారించవచ్చు.మీ క్రెడిట్ కార్డ్ బిల్లు ఎప్పుడు తయారవుతుందో తెలిపే తేదీ.

ఆ బిల్లును ఎప్పటిలోపు చెల్లించాలో తెలిపే చివరి తేదీ.

అంటే బిల్లు తయారయ్యే తేదీ అయితే, ఆ బిల్లుకు చెల్లింపు చేయాల్సిన గడువు. ఈ రెండు తేదీల మధ్య ఉన్న సమయం బిల్లును పరిశీలించడానికి, ఖర్చులను చెక్ చేసుకోవడానికి, చెల్లింపుకు డబ్బును సిద్ధం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.పెద్ద కొనుగోళ్లకు కూడా ఉపయోగపడుతుంది:మీ కార్డ్ఎప్పుడు వస్తుందో తెలుసుకోవడంవల్ల పెద్ద కొనుగోళ్లను ప్లాన్ చేసుకోవచ్చు. సాధారణంగా స్టేట్‌మెంట్ తయారైన వెంటనే చేసే కొనుగోలు తదుపరి బిల్లింగ్ సైకిల్‌లోకి వెళ్లే అవకాశం ఉంటుంది. దీంతో ఆ ఖర్చును చెల్లించడానికి ఎక్కువ సమయం లభించవచ్చు. అయితే ప్రతి బ్యాంకు, క్రెడిట్ కార్డ్ జారీ సంస్థకు బిల్లింగ్ సైకిల్, చెల్లింపు నిబంధనలు వేర్వేరుగా ఉండవచ్చు. అందుకే మీ కార్డ్ స్టేట్‌మెంట్‌లో ఇచ్చిన తేదీలు, షరతులను తప్పనిసరిగా పరిశీలించాలి.పేమెంట్ డ్యూ డేట్ ఎందుకు చాలా ముఖ్యం?రెండు తేదీలను గమనించడం అవసరమే అయినప్పటికీ, ఞ్వకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. గడువు తేదీలోపు మొత్తం బకాయిని చెల్లించకపోతే వడ్డీ, లేట్ పేమెంట్ ఛార్జీలు పెరగవచ్చు. కేవలంచెల్లించి మిగిలిన మొత్తాన్ని బకాయిగా ఉంచితే, ఆ మొత్తంపై వడ్డీ భారం పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే వీలైనంత వరకు మొత్తం బకాయిని గడువులోపు చెల్లించడం మంచిదిక్రెడిట్ కార్డ్ బిల్లును ఎలా నిర్వహించాలి?

ముందుగా మీ తెలుసుకోండి.

ప్రతి నెల బిల్లులో ఏ లావాదేవీలు ఉన్నాయో పరిశీలించండి.

ను క్యాలెండర్ లేదా రిమైండర్‌లో పెట్టుకోండి.

వీలైనంత వరకు మొత్తం బకాయిని గడువులోపు చెల్లించండి.

పెద్ద కొనుగోళ్లు చేసే ముందు మీ బిల్లింగ్ సైకిల్‌ను అర్థం చేసుకోండి.

మొత్తానికి.. మీ బిల్లు ఎప్పుడు తయారవుతుందో చెబుతుంది. ఞ్వ మాత్రం ఆ బిల్లును ఎప్పటిలోపు చెల్లించాలో చెబుతుంది. ఈ రెండు తేదీలను సరిగ్గా అర్థం చేసుకుని క్రెడిట్ కార్డ్‌ను ఉపయోగిస్తే అనవసరమైన వడ్డీ, లేట్ ఫీజులు వంటి ఖర్చులను తగ్గించుకోవచ్చు.

# కేవలం రూ.50 వేలు ఖర్చు పెడితే చాలు నెలకు రూ.60 వేల సంపాదన.



వ్యాపారం అంటే లక్షలు, కోట్లతో కూడుకున్న పని అని చాలామంది పొరపాటు పడుతుంటారు. మీరు బిజినెస్ స్టార్ట్ చేయాలంటే లక్షలు, కోట్లు అవసరం లేదు. తక్కువ పెట్టుబడితో మొదలుపెట్టగలిగే వ్యాపారాలు చాలానే ఉన్నాయి. మీ దగ్గర రూ.50 వేలు ఉన్నా మంచి వ్యాపారం ప్రారంభించి అధిక ఆదాయం పొందవచ్చు. సరైన ప్లానింగ్ తెలివి, హార్డ్ వర్డ్ చేసే తత్వం ఉంటే బాగా డబ్బులు సంపాదించవచ్చు. బిజినెస్ స్టార్ట్ చేసిన తక్కువ సమయంలోనే డబ్బులు మీ చేతిలోకి వస్తాయి. రూ.50 వేలలో మొదలుపెట్టగలిగే ఐదు బెస్ట్ బిజినెస్‌ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

హోమ్ ఫుడ్ బిజినెస్

ఫుడ్ బిజినెస్ చేయాలంటే రూమ్ అవసరం లేదు. కేవలం మీ వంటిట్లోనే ఆహార పదార్థాలు వండి విక్రయించవచ్చు. ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులకు మీరు విక్రయించి డబ్బులు సంపాదించవచ్చు. రోజుకు మీరు 30 నుంచి 50 మందికి అందించినా నెలకు రూ.60 వేల వరకు సంపాదించవచ్చు. ఖర్చులు పోను మీకు రూ.30 వేల వరకు మిగులుతాయి. అయితే కిరాణా సరుకులకు రూ.15 వేలు, ప్యాకింగ్ మెటీరియల్స్‌కు రూ.10 వేలు, డెలివరీ రూ.15 వేలు ఖర్చు అవుతుంది. ఇక వంట పాత్రలకు రూ.10 వేలు అవుతుంది. రూ.50 వేల ఖర్చుతో మీరు ఈ వ్యాపారం స్టార్ట్ చేయవచ్చు.

ఇక మొబైల్ యాక్సెసరీస్ విక్రయం

మొబైల్ ఛార్జర్లు, ఇయర్ ఫోన్లు, పవర్ బ్యాంక్, టెంపర్డ్ గ్లాస్ వంటివి విక్రయించడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చు. ఎక్కువగా విక్రయాలు జరిగితే నెలకు రూ.25 నుంచి రూ.40 వేల వరకు మీరు సంపాదించవచ్చు. స్టాక్ ఖర్చు రూ.35 వేలు, షెల్ఫ్ రూ.10 వేలు, ప్రచారానికి రూ.5 వేలు ఖర్చు అవుతుంది.

ప్రింటింగ్, జిరాక్స్

జిరాక్స్, లామినేషన్, కలర్ ప్రింట్, స్పైరల్ బైండింగ్ వంటి వాటి ద్వారా మీరు డబ్బులు సంపాదించవచ్చు. స్కూల్స్, కాలేజీలు, ఆఫీసుల దగ్గర మీరు ఈ వ్యాపారం స్టార్ట్ చేస్తే డబ్బులు ఎక్కువగా వస్తాయి. నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు సంపాదించవచ్చు. ప్రింటర్‌కు రూ.20 వేలు, కంప్యూటర్ రూ.20 వేలు, పేపర్, ఇంక్ రూ.10 వేలు ఖర్చు అవుతుంది.

నేచురల్ ప్రొడక్ట్స్ అమ్మకం

రాగి పిండి, కారం పొడి, సజ్జ పిండి, పసుపు, ఆర్గానిక్ బెల్లం, కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ వంటి వాటివి విక్రయించే ఆదాయ పొందవచ్చు.

# పోస్టాఫీసులలో టాప్ 5 సేవింగ్స్ స్కీమ్




ఆర్థిక భద్రత, వృద్ధి కోసం ప్రభుత్వ మద్దతుగల, సురక్షితమైన పెట్టుబడి ఎంపికలు ఎల్లప్పుడూ ప్రాధాన్యతను పొందుతాయి. పోస్ట్ ఆఫీస్ అనేక రకాల పొదుపు పథకాలను అందిస్తుంది. ఇవి పౌరులకు సంపదను పెంపొందించుకోవడానికి, పన్ను ప్రయోజనాలను పొందడానికి, స్థిరమైన ఆదాయాన్ని సంపాదించడానికి, భవిష్యత్ ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి సహాయపడతాయి. ఈ వ్యాసం టాప్ 5 పోస్ట్ ఆఫీస్ పథకాలను వివరంగా తెలుసుకుం దాం. అందులో పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ , కిసాన్ వికాస్ పత్ర , సుకన్య సమృద్ధి యోజన , పోస్ట్ ఆఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ , సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ ఖాఖీ అనేది 15 సంవత్సరాల కాలపరిమితి కలిగిన దీర్ఘకాలిక పెట్టుబడి పథకం. ఈ ఖాతా ను బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీస్ ద్వారా ఎవరైనా భారతీయ పౌరులు తెరవవచ్చు (ఎన్‌ఆర్‌ఐలు మినహా). ఇది సంవత్సరానికి కనీసం రూ.500 నుండి గరిష్టంగా రూ.1,50,000 వరకు పెట్టుబడి పెట్టడానికి అనుమతిస్తుంది. ప్రస్తుత వడ్డీ రేటు సాధారణంగా 7.1% ఉంటుంది. పీపీఎఫ్ ముఖ్యమైన ప్రయోజనం ట్రిపుల్ జు (ఎగ్జమ్ట్, ఎగ్జమ్ట్, ఎగ్జమ్ట్) పన్ను ప్రయోజనం. సెక్షన్ 80జ కింద రూ.1,50,000 వరకు పెట్టుబడులకు పన్ను మినహాయింపు లభిస్తుంది. సంపాదించిన వడ్డీ, అలాగే మెచ్యూరిటీ మొత్తం పూర్తిగా పన్ను రహితం. 15 సంవత్సరాల తర్వాత, రూ.1,50,000 వార్షిక పెట్టుబడితో రూ.40 లక్షలకు పైగా రాబడిని పొందవచ్చు. 4వ ఆర్థిక సంవత్సరం నుండి రుణాలు తీసుకోవచ్చు. 6వ ఆర్థిక సంవత్సరం నుండి పాక్షిక ఉపసంహరణలు అనుమతి ఉంటుందిౠ పథకం మీ పెట్టుబడిని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ట పరిమితి లేదు. ప్రస్తుత వడ్డీ రేటు 7.5% కాగా, పెట్టుబడి మొత్తం 115 నెలల్లో రెట్టింపు అవుతుంది. ఈ పథకం 80జ పన్ను ప్రయోజనం కిందకు రాదు. సంపాదించిన వడ్డీ పన్ను పరిధిలోకి వస్తుంది. దీర్ఘకాలికంగా తమ డబ్బు రెట్టింపు కావాలనుకునే వారికి ఖ్వూ ఒక ఆకర్షణీయమైన ఎంపిక.3. సుకన్య సమృద్ధి యోజన 1, జూలై 1, అక్టోబర్ 1, జనవరి 1న) నేరుగా పెట్టుబడిదారుడి బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. ఉదాహరణకు రూ.30 లక్షల పెట్టుబడిపై ప్రతి మూడు నెలలకోసారి రూ.61,500 వడ్డీ లభిస్తుంది. సెక్షన్ 80జ కింద పన్ను ప్రయోజనాలు కూడా అందుబాటులో ఉన్నాయి, కానీ సంపాదించిన వడ్డీ పన్ను పరిధిలోకి వస్తుంది. ఈ పోస్ట్ ఆఫీస్ పథకాలు వివిధ ఆర్థిక అవసరాలు, వయస్సు వర్గాలకు అనుగుణంగా రూపొందించారు. పెట్టుబడిదారులు తమ లక్ష్యాలు, రిస్క్ ు సరిపోయే పథకాన్ని ఎంచుకోవడా నికి ప్రతి పథకం లక్షణాలను జాగ్రత్తగా పరిశీలించాలి.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# ఓటిటి బాటపట్టిన చెన్నై లవ్ స్టోరీ



కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ ప్రధానపాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ' ఓటిటి బాట పట్టింది. రవి నంబూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి యూత్‌కు కనెక్ట్ అయింది. ఇప్పుడీ ప్రేమకథ ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. సోనీలివ్ వేదికగా ఆగస్టు 21 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులోకి రానున్నట్లు సంస్థ అధికారికంగా తెలిపింది. కథేంటంటే..: నివి (శ్రీ గౌరీ ప్రియ) తను ప్రేమించిన అబ్బాయి అజయ్ (త్రిగుణ్)తో కలిసి పెళ్లికి సిద్ధమవుతుంది. కానీ, తీరా ముహూర్త సమయానికి పెళ్లి పీటలెక్కాల్సిన ఆ కుర్రాడు తాను మరో అమ్మాయిని ప్రేమించానని చెప్పి.. బ్రేకప్ చెప్పి వెళ్లిపోతాడు. ఆమెని ఆ బాధ నుంచి బయట పడేసేందుకు మిత్రులు చెన్నైకి తీసుకెళ్లినా ఏ మార్పూ రాదు. పైగా ప్రేమ విఫలమైన బాధలో దేవదాసులా మందుకు బానిసవుతుంది. అలాంటి సమయంలో ఆమె ఉంటున్న ఇంట్లోకి స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) అడుగు పెడతాడు. అతనొక అనాథ. దర్శకుడవ్వాలన్న ఆశతో చెన్నైలోకి అడుగు పెట్టిన అతనికి.. నివి ఫ్రెండ్స్ గ్యాంగే ఆశ్రయమిస్తారు. మొదట్లో స్టీవెన్ చేసే పనులు నివికి చిరాకు తెప్పించినా.. క్రమంగా అతని మాటలు, చేతలు తనలో మార్పు తెస్తాయి. ఈ క్రమంలోనే బ్రేకప్ బాధ నుంచి బయటపడి.. స్టీవెన్‌కి దగ్గరవుతుంది. మళ్లీ ఆమెలో ప్రేమ చిగురిస్తుంది. మరి ఆ తర్వాత వాళ్లిద్దరి ప్రయాణం ఎలా సాగిందనేది కథ.

## డిసి సక్సెస్‌తో మైత్రీమూవీ మేకర్స్ విజయోత్సవ వేడుక



టాలెంటెడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డిసి' చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుని దూసుకుపోతోంది. ఈ సినిమా సాధించిన సంచలన విజయంతో చిత్ర పరిశ్రమలో ప్రశంసల జల్లు కురుస్తోంది. అయితే ఈ సినిమా సాధించిన సక్సెస్ నేపథ్యంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా ప్రాజెక్ట్ 'ఎఎ23' టీమ్ మరియు ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ అధినేతలు డైరెక్టర్ లోకేష్ కనగరాజ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. 'డిసి' మూవీ బ్లాక్‌బస్టర్ సక్సెస్‌ను పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఘనంగా వేడుకలు నిర్వహించింది. ఈ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన ప్రత్యేక ఫొటోలను మైత్రి మూవీ మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. 'డిసి చిత్రానికి అఖండ విజయం అందించినందుకు అభినందనలు లోకేష్ కనగరాజ్. ఇప్పుడు ఎఎ23 వంతు! అంటూ మైత్రీ రాసుకోచ్చింది. ప్రస్తుతం డీసీ సక్సెస్ మూడ్‌లో ఉన్న లోకీ త్వరలోనే 'ఎఎ23' ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించబోతున్నాడు.

-----

## విజయ్ రణబాలి నుంచి పోస్టర్ విడుదల




స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమా నుంచి మేకర్స్ ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం 1854-1878 కాలంలో రాయలసీమ నేపథ్యంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగే చారిత్రక పోరాటం ఆధారంగా రూపుదిద్దుకుంటోంది. 'మరపురాని చరిత్రలోని అత్యంత సాహసోపేతమైన అధ్యాయం అనే ట్యాగ్‌లైన్‌తో ఈ పోస్టర్ హైలైట్ అవుతోంది. ఈ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ రక్తం, మట్టితో కూడిన యుద్ధ వీరుడి రూపంలో కనిపిస్తున్నారు. ఆయన పొడవుగా ఉన్న జుట్టు, మీసం, ఒంటిపై గాయాలు ఈ పాత్ర తీవ్రతను తెలియజేస్తున్నాయి. జాతీయ జెండా ఆయన భుజంపై ఒక యోధుడి కవచంలా కప్పబడి ఉంది. దీనికి ఉన్న రక్తపు మరకలు స్వాతంత్ర్య పోరాటంలోని త్యాగాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇక ప్రస్తుతం ఇందుకు సంబంధించిన లుక్ వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో విజయ్ సరసన రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ (ది మమ్మీ ఫేమ్) కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

# సైరాబాను ఫస్ట్ లుక్ విడుదల




హీరో ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త తెలుగు చిత్రం 'సైరాబాను' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నేడు, స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఆఫీషియల్ గా రిలీజ్ చేశారు. ఈ సినిమాలో ఆది సాయికుమార్ సరసన 'మసూద' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న బాంధవి శ్రీధర్ హీరోయిన్‌గా నటిస్తోంది. హాస్య మూవీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత రాజేష్ దండా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండగా, ఈ చిత్రం ద్వారా ఫణి కృష్ణ సిరికి దర్శకుడిగా తెలుగు చిత్రసీమకు పరిచయం అవుతున్నారు. ఈ సినిమా విభిన్న సంస్కృతుల నేపథ్యంలో సాగే ఒక పవర్‌ఫుల్ అండ్ వైబ్రెంట్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది. ఔట్ అండ్ ఔట్ కామెడీ, ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర స్వరాలను అందిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే చిత్ర యూనిట్ ప్రకటించనుంది. అయితే పోస్టర్‌లోని నేపథ్యం కథను మరింత ఆసక్తికరంగా మారుస్తోంది. ఒకవైపు హిందూ దేవాలయం, మరోవైపు ఇస్లామిక్ శైలిలో నిర్మించిన కట్టడం రెండు విభిన్న ప్రపంచాలను ఒకే ఫ్రేమ్‌లో నిలబెట్టినట్లుగా అనిపిస్తోంది. మధ్యలో ఎగురుతున్న తెల్ల పావురాలు శాంతి, ప్రేమకు ప్రతీకగా నిలుస్తూ పోస్టర్ లుక్ మాత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో హీరో ఆది సాయికుమార్ పక్కా తెలుగు సాంప్రదాయాలు, పద్ధతులు ఉన్న కుటుంబానికి చెందిన యువకుడిగా నటిస్తున్నారు. అలాగే, హీరోయిన్ బాంధవి శ్రీధర్ ఆధునిక ఆలోచనలు ఉన్న ముస్లిం యువతి (సైరాబాను) పాత్రలో కనిపిస్తున్నారు. వేర్వేరు నేపథ్యాలు, ఆచారాలు ఉన్న ఈ ఇద్దరి మధ్య ప్రేమ ఎలా చిగురించింది, వారి ప్రేమను గెలిపించుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు పడ్డారు అనేదే ఈ సినిమా కథాంశంగా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. దర్శకుడు ఫణి కృష్ణ సిరికి ఈ ప్రేమకథను ఎమోషనల్‌గానే కాకుండా, రెండు కుటుంబాల మధ్య జరిగే ఔట్ అండ్ ఔట్ ఫ్యామిలీ కామెడీ ఎంటర్‌టైనర్‌గా కూడా తెరకెక్కిస్తున్నారు.

---------

# సంక్రాంతి బరిలో సాయి తేజ్...

## 'సంబరాల ఏటి గట్టు' రిలీజ్ డేట్ ఇదే!




సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్ కథానాయకుడిగా, రోహిత్ కేపీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'సంబరాల ఏటి గట్టు' (ఎస్+) విడుదల తేదీని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు శనివారం వెల్లడించింది. ఈ ప్రకటనతో మెగా అభిమానుల్లో పండుగ వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా సాయి దుర్గా తేజ్ తన ఎక్స్ ఖాతా ద్వారా స్పందిస్తూ, "సంక్రాంతికి కలుద్దాం... #SYGonJan12th #SambaraluForSankranthi»» అని పేర్కొంటూ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. తేజ్ కెరీర్‌లోనే అత్యంత భారీ స్థాయిలో, సుమారు రూ.125 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటం విశేషం. బ్లాక్‌బస్టర్ చిత్రం 'హనుమాన్' తర్వాత ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

'సంబరాల ఏటి గట్టు' చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో తీర్చిదిద్దుతున్నారు. ఈ చిత్రంలో సాయి దుర్గా తేజ్ సరసన ప్రముఖ నటి ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్నారు. జగపతి బాబు, శ్రీకాంత్, సాయి కుమార్, అనన్య నాగళ్ల, రవి కృష్ణ వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లోనే జాతీయ అవార్డు గ్రహీత పీటర్ హెయిన్ నేతృత్వంలో ఒక భారీ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఈ సినిమాలో తేజ్ ఒక ప్రముఖ బాలీవుడ్ సూపర్‌స్టార్‌తో తలపడనున్నారని, ఆయన శక్తివంతమైన ప్రతినాయకుడి పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఈ పాత్ర కోసం సాయి దుర్గా తేజ్ గత రెండేళ్లుగా శారీరకంగా, మానసికంగా తీవ్రంగా శ్రమిస్తున్నారు. సినిమాలోని కీలక సన్నివేశాల కోసం గ్రాఫిక్స్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. 'సంబరాల ఏటి గట్టు' చిత్రానికి వెట్రి పళనిస్వామి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అజనీష్ లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న ఈ యాక్షన్ డ్రామా, భారతీయ చిత్ర పరిశ్రమలో ఒక మైలురాయిగా నిలుస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

# కట్టలు తెంచుకున్న రోమాన్స్ ..హుషారు పిట్టలు !




యువతరమే లక్ష్యంగా తీర్చిదిద్దిన తాజా చిత్రం 'హుషారు పిట్టలు'. ఏషియన్ సురేశ్ ఫిల్మ్స్ లాంటి పెద్ద సంస్థ దీన్ని స్వయంగా విడుదల చేస్తుండటం.. ప్రేక్షకుల దృష్టి ఈ సినిమాపై పడింది. రవి (అన్ష్) టాపర్. టెన్త్‌లో స్కూల్ ఫస్ట్. చదువు తప్ప మరో ధ్యాస లేని ఆ కుర్రాడిని.. ఊళ్లోని బాలు గ్యాంగ్ అశ్లీల వీడియోలు చూపించి చెడగొడుతుంది. దీంతో పుస్తకాల్ని పక్కకు పెట్టేసి అమ్మాయిల్ని పడేసే పనిలో పడతాడు. ఈ క్రమంలోనే అదే ఊరిలో ఉండే చిట్టి (వాసవి గణెళిశన్)ని ఇష్టపడతాడు. అప్పటికే అతనిపై ఆకర్షణతో ఉన్న ఆమె కూడా అతడికి దగ్గరవుతుంది. పరిపక్వత లేని ఆ వయసులో వాళ్లిద్దరూ హద్దులు దాటేస్తారు. ఓరోజు అలా కలిసి ఉండగా తల్లిదండ్రులకు దొరికిపోతారు. మరి ఆ తర్వాత ఏమైంది? తమ పిల్లల్ని అలా చూడకూడని స్థితిలో చూసిన ఆ తల్లిదండ్రులు ఏమైపోయారు? ఆ బాధని గుండెల్లో దాచుకుని ఎలాంటి కఠిన నిర్ణయాలు తీసుకున్నారు? ఓవైపు అమ్మానాన్నల వ్యతిరేకతను.. సమాజం నుంచి ఎదురయ్యే ఛీత్కారాలను ఎదుర్కొంటూ ఆ జంట తమ ప్రేమ కోసం ఏం చేశారు? దాని వల్ల వాళ్ల జీవితాల్లో చోటు చేసుకున్న పరిణామాలేంటి? ఆఖరికి వాళ్లు ఒక్కటయ్యారా.. లేదా? చిన్న వయసులో తెలిసీ తెలియక చేసిన తప్పు వల్ల ఆఖరికి వాళ్ల జీవితాలు ఎలా మారాయి? అన్నది మిగిలిన కథ. ఇది యువతరం లక్ష్యంగా రూపొందిన సినిమా. టీజర్.. ట్రైలర్‌లతోనే ఈ చిత్ర కంటెంట్ ఏంటి? ఎంత బోల్డ్‌గా ఉంటుందనే దానిపై స్పష్టత ఇచ్చేశారు. 'బస్ స్టాప్', 'ఈరోజుల్లో..' లాంటి చిత్రాల ఛాయల్లోనే సాగుతుంది. సినిమాలో సింహభాగం అడల్ట్ కంటెంట్‌తో నవ్వులు పంచి.. ఆఖరిలో ఎమోషనల్ టచ్‌తో చిన్న సందేశం ఇచ్చి ప్రేక్షకుల్ని థియేటర్ నుంచి బయటికి పంపుతుంది. ఇది పిల్లలతో పాటు తల్లిదండ్రులు చూడాల్సిన చిత్రమే అయినప్పటికీ.. ఆ అడల్ట్ కంటెంట్‌ని స్వీకరించే సాహసం చేస్తారా అన్నది సందేహమే. నాయకా నాయికల పాత్రల పరిచయం.. ఒకరిపై ఒకరికి ఆకర్షణ.. ఫోన్ ముచ్చట్లు.. హద్దులు దాటి దగ్గరయ్యేందుకు చేసే ప్రయత్నాలు.. కథలో సంఘర్షణని రగిలించేలా ఉంటాయి. అంత వరకు చాటుమాటుగా సాగిన రవి - చిట్టీల వ్యవహారం ఇంటిదాకా చేరడంతో ద్వితీయార్ధం ఆసక్తికరంగా మొదలవుతుంది. కాకపోతే ఆయా సన్నివేశాలన్నీ ఊహలకు అందేలా ఉంటాయి. ఇక ఎప్పుడైతే వీళ్లు రెడ్ హ్యాండెడ్‌గా ఇంట్లో వాళ్లకి దొరికిపోతారో అక్కడి నుంచి కథ సీరియస్ టోన్‌లోకి టర్న్ తీసుకుంటుంది. రవి - చిట్టి తప్పటడుగులు వేయడం వెనకున్న కారణాల్ని బలంగా చెప్పే ప్రయత్నం చేశారు. పిల్లలు ఎదురుగా తల్లిదండ్రులు చేసే పనులు వాళ్ల వ్యక్తిత్వాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి.. అతి గారాబం.. తప్పుడు స్నేహాలు, సెల్ ఫోన్ వాడకం వాళ్లని ఎలా తప్పుడు దారుల్లో నడిచేలా పురిగొల్పుతాయన్నది కళ్లకు కట్టినట్లు చూపించారు. పరిణతి లేని ప్రేమికుల్లా ఆ రెండు పాత్రల్లో అన్ష్, వాసవి సహజమైన నటనతో ఆద్యంతం అలరించారు. రొమాంటిక్ సీన్స్ తో పాటు భావోద్వేగ భరిత సన్నివేశాల్లోనూ మెప్పించారు. ముఖ్యంగా చిట్టి పాత్రలో వాసవి చెప్పే డైలాగ్స్.. శైలు పాత్రని ఇబ్బంది పెడుతూ తను చేసే హంగామా యువతకి బాగా వినోదాన్ని పంచిస్తుంది. కథానాయిక తండ్రి పాత్రలో గోవర్ధన్, హీరో తల్లిదండ్రులుగా సునీత, రమేష్ ఆకట్టుకుంటారు. ఇది తెలిసిన కథే అయినా.. యువతరాన్ని ఆకట్టుకునేలా మలచడంలో దర్శకుడు విజయం సాధించాడు.

# విభిన్న కథతో శ్రీవిష్ణు..

## 'కామ్రేడ్ కళ్యాణ్' విడుదల తేదీ ఫిక్స్




విలక్షణ కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ విడుదల తేదీని చిత్రబృందం శనివారం అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 9న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు తెలిపింది.

ఈ విషయాన్ని శ్రీవిష్ణు తన సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. "కామ్రేడ్స్! అక్టోబర్ 9న థియేటర్లలో మన 'కామ్రేడ్ కళ్యాణ్'తో 'లాల్ సలాం' చెబుదాం" అంటూ విడుదల తేదీ పోస్టర్‌ను షేర్ చేశారు. జనక్‌రామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ రచయిత కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పి పతాకంపై వెంకట కృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్నారు. 1992 నాటి ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో 'కామ్రేడ్ కళ్యాణ్' సినిమా కథ సాగనుంది. శ్రీవిష్ణు, మహిమా నంబియార్‌తో పాటు సీనియర్ నటి రాధికా శరత్‌కుమార్, మలయాళ నటుడు షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే వంటి ప్రముఖులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఇప్పటికే 'కామ్రేడ్ కళ్యాణ్' సినిమా నుంచి జూన్‌లో విడుదలైన 'ఒరియా పిల్ల' పాట చార్ట్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. విజయ్ బుల్గానిన్ స్వరపరిచిన ఈ గీతాన్ని సిద్ శ్రీరామ్ ఆలపించగా, భాస్కరభట్ల సాహిత్యం అందించారు. ఈ చిత్రానికి సాయిశ్రీరామ్ సినిమాటోగ్రఫీ, చోటా కె ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ప్రజా రిపబ్లిక్



# ఇష్టానుసారంగా..

## రోడ్లపైనే కార్పొరేషన్ వాహనాలు..




**అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం**

**ముప్పుతో .. అధికారులకు కనువిప్పు కాదా**

**రహదారులపై ప్రయాణికులకు ఇబ్బందులు**

**ట్రాఫిక్ నియంత్రణలో పోలీసుల వైఫల్యం**

**మీ నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు పోవాల్సిందే .. నా**

**ప్రజా రిపబ్లిక్ ప్రత్యేక కథనం .. ఉమ్మడి అనంతపురం**

అనంతపురం నగరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ప్రధాన రహదారులపై ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్, వ్యాపారుల ఆక్రమణలు, తోపుడు బండ్లు, టిఫిన్ సెంటర్లు, ఆటో స్టాండ్లతో రహదారులు కుంచించుకుపోతున్నాయి. వీటికి తోడు నగర కార్పొరేషన్‌కు చెందిన చెత్త తరలింపు భారీ వాహనాలు, ట్రాక్టర్లను సైతం ప్రధాన రహదారుల పక్కనే గంటల తరబడి నిలిపివేయడం ప్రయాణికులకు ప్రమాదకరంగా మారుతోంది. సంబంధిత అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### రహదారి పక్కనే.. రాకపోకలకు తీవ్ర అంతరాయం

సప్తగిరి సర్కిల్ సమీపంలోని సీఐఎస్ఐ చర్చి వద్ద ప్రధాన రహదారి పక్కనే కార్పొరేషన్ చెత్త తరలింపు వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. ఇదే ప్రాంతంలో ఆర్టీసీ రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఉండటంతో తగరకుంట, గాండ్లపర్తి, కనగానపల్లి, ముత్తువకుంట్ల తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు ప్రయాణికులను ఎక్కించుకుంటున్నాయి. బస్‌స్టాప్ వద్ద ప్రయాణికులు, ఆటోలు, ఇతర వాహనాలతో రద్దీగా ఉండే సమయంలో చెత్త తెరలించే భారీ వాహనాలను రహదారి పక్కనే నిలపడం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కార్పొరేషన్ పరిధిలో పార్కింగ్ చేసుకోవాల్సిన వాహనాలను ప్రధాన రహదారులపై ఎందుకు నిలుపుతున్నారనే విమర్శలు తలెత్తుతున్నాయి. ఉదయం నుంచే వాహనాలను రోడ్డుపై నిలిపి సాయంత్రం వరకు అక్కడే ఉంచుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు.

### ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది

నగరంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, ఆర్టీసీ బస్సులు నిరంతరం రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి రద్దీ ప్రాంతాల్లో భారీ వాహనాలను రహదారి పక్కన నిలిపితే ఎదురుగా వచ్చే వాహనాలను గమనించేందుకు అవకాశం ఉండదు. అందువల్ల ఏదైనా ప్రమాదం సంభవిస్తే బాధ్యత ఎవరిది. ప్రజల భద్రతకు సంబంధించిన అంశంలో అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉండగా, ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం ఎందుకని ప్రజలు నిలదీస్తున్నారు. కార్పొరేషన్ వాహనాలు నిర్ణీత ప్రదేశంలోనే నిలిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ఒక్కచోటే కాదు.. నగరమంతా ఇదే పరిస్థితి

సప్తగిరి సర్కిల్ వద్ద పరిస్థితి మాత్రమే కాదు.. నగరంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో రోడ్లపైనే వాహనాల పార్కింగ్ కొనసాగుతోంది. లలితకళా పరిషత్ సమీపంలోని మెహ్ఫిల్ ప్రాంతంలో రహదారి పక్కనే కార్లు, ద్విచక్ర వాహనాలను ఇష్టానుసారంగా నిలుపుతున్నారు. టవర్‌క్లాక్ సమీపంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సూర్యనగర్ 80 అడుగుల రహదారి, ధర్మవరం రిక్వెస్ట్ బస్‌స్టాప్ పరిసరాల్లో రోడ్డు పొడవునా వాహనాల పార్కింగ్‌తో పాటు హోటల్లు నిర్వహణతో వాహన రాకపోకలకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కోర్టు రోడ్డు, నాయుడు హోటల్ పరిసరాలు, జోష్ అలుకాస్ ప్రాంతాల్లో ముఖ్యంగా సాయంత్రం వేళల్లో వాహనాలను అడ్డదిడ్డంగా నిలపడంతో ట్రాఫిక్ నెమ్మదిస్తోంది. మరోవైపు రోడ్లపై తోపుడు బండ్లు, టీ దుకాణాలు, టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో అందుబాటులో ఉన్న రహదారి మరింత కుదించుకుపోతోంది.



### అత్యవసర వేళల్లో అంబులెన్సులు వెళ్లేందుకు ఇబ్బందులు

నగరంలోని ప్రధాన రహదారులపై ట్రాఫిక్ అంతరాయం పెరిగితే అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆస్పత్రులకు వెళ్లే రోగులు ట్రాఫిక్‌లో చిక్కుకుంటే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతుంది. నగరంలో సాధారణంగా 20 నిమిషాల్లో చేరాల్సిన ప్రాంతాలకు ట్రాఫిక్ కారణంగా ఎక్కువ సమయం పడుతోందని వాహనదారులు చెబుతున్నారు. మరి ముఖ్యంగా కమలానగర్లో ప్రధాన వీధులు గుండా ఉన్న రోడ్లు మొత్తం ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసి ఉండడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పాత ఊరులోని మార్కెట్ పరిసరాలు ప్రాంతాలలో, గాంధీ సర్కిల్ నుంచి పవర్ ఆఫీస్ వరకు మొత్తం రోడ్లన్నీ తోపుడు బండ్లు ద్విచక్ర వాహనాలతోనే రోడ్ల పక్కనే వాహనదారులు పార్కింగ్ చేసి వెళ్తున్నారు. దీంతో ఆ పరిసర ప్రాంతాలు వాహనదారులకు భారీ తలనొప్పిగా మారుతున్నాయి. అటు వెళ్లాలంటేనే గుండెలను చేతుల్లో పట్టుకుని ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. అందులో భాగంగా ప్రధాన రహదారులపై ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌లను నియంత్రించాల్సిన అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

### పార్కింగ్ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తున్నారా

నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా పార్కింగ్ సౌకర్యాలు లేకపోవడం మరో సమస్యగా మారింది. భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే సమయంలో పార్కింగ్ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, దుకాణాల వద్ద పార్కింగ్‌కు సరైన స్థలం లేకపోవడంతో వాహనదారులు రహదారులనే పార్కింగ్ స్థలాలుగా ఉపయోగిస్తున్నారన్నారని వ్యాపారస్తులు వాపోతున్నారు.

### .రహదారులపై అక్రమ పార్కింగ్ మాత్రం తగ్గడం లేదు

నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నప్పటికీ ప్రధాన రహదారులపై అక్రమ పార్కింగ్ మాత్రం తగ్గడం లేదని వాహనదారులు అంటున్నారు. ట్రాఫిక్ సిబ్బంది క్రమం తప్పకుండా ప్రధాన కూడళ్లను పరిశీలించి రహదారులకు అడ్డుగా ఉన్న వాహనాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రమాదం జరిగిన తర్వాత అధికారులు హంగామా

నగర అభివృద్ధి అంటే కేవలం కొత్త నిర్మాణాలు, రహదారులు వేయడం మాత్రమే కాదని.. ఉన్న రహదారులను ప్రజలు సురక్షితంగా వినియోగించుకునేలా చూడటమూ అధికారుల బాధ్యతేనని నగరవాసులు పేర్కొంటున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత అధికారులు హడావిడితో హంగామా చేస్తారే తప్ప పరిస్థితిని అదుపులోకి తీసుకురారు అని చెప్పవచ్చు. ప్రమాదం జరగకనే చర్యలు తీసుకోవాల్సి ఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ట్రాఫిక్ పోలీసుల తీరు కూడా అలాగే ఉంది. రోడ్లపై ఉన్న వాహనాలను తొలగించాల్సిన ట్రాఫిక్ పోలీసులు వాటిని తొలగించకుండా కాలక్షేపం కోసమేనేమో.. విధులు నిర్వహించేది అన్న చందంగా ఉంది. రోడ్లపై వాహనాల నిలుపుదలపై కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక దృష్టి సారించి నగర ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.







---

# సూర్యన్ చిన్నపిల్లల ఆసుపత్రి అత్యాధునిక అంబులెన్స్ ప్రారంభం

**సూర్యన్ చిన్నపిల్లల ఆసుపత్రి లో విజయవంతంగా ముగిసిన మూడు రోజుల నవజాత శిశువులు, చిన్నపిల్లల ఉచిత వైద్య శిబిరం.**

**. నవజాత శిశువుల కోసం, చిన్నపిల్లల అత్యవసర చికిత్స కోసం అత్యాధునిక వసతులతో అంబులెన్స్**

**. ప్రారంభించిన డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మధుసూదనరావు**

**నంద్యాల ఆగస్టు 16 (రిపబ్లిక్ న్యూస్) :**

నంద్యాల పద్మావతి నగర్ లో స్టేడియం దగ్గరలో ఉన్న సూర్యన్ చిన్నపిల్లల ఆసుపత్రి లో దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రారంభించిన మూడు రోజుల నవజాత శిశువులు, చిన్నపిల్లల ఉచిత వైద్య శిబిరం ఆదివారం సాయంత్రం విజయవంతంగా ముగిసింది. డాక్టర్ నయన్ బాబా, డాక్టర్ సునీత్ లు 200 మంది శిశువులను, చిన్న పిల్లలను పరీక్షించి ఒక్కొక్కరికి 2500 రూపాయలు విలువచేసే శిశువుల వినికిడి పరీక్షలు, పుట్టుకతో వచ్చే గుండె జబ్బుల స్క్రీనింగ్ ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా సూర్యన్ చిన్నపిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో నవజాత శిశువులు,చిన్నపిల్లల కోసం అత్యవసర చికిత్స అందించే అత్యాధునిక అంబులెన్స్ ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, నంద్యాల ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు ప్రారంభించారు. అంబులెన్స్ లో ట్రాన్స్ పోర్ట్ వెంటిలేటర్ ను నంద్యాల గైనకాలజీ వైద్యుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యన్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నయన్ బాబా, డాక్టర్ సునీత్ లు మాట్లాడుతూ ప్రసవం తర్వాత ఆసుపత్రుల నుండి చిన్నపిల్లల ఆసుపత్రికి తీసుకువచ్చే సమయంలో చికిత్స అందిస్తూ తీసుకురావడానికి, దారిలో సమస్యలు వస్తే అవసరమైతే వెంటిలేటర్ అమర్చడానికి అనుగుణంగా అంబులెన్స్ ని రూపొందించామని, ఈ అంబులెన్స్ ద్వారా నంద్యాల జిల్లాలో అన్ని ప్రాంతాల నుండి తీసుకువచ్చే విధంగా ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మణిదీప్, ఆస్పత్రి డైరెక్టర్లు నాగ కుమార్, సుధాకర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.




**అత్యాధునిక అంబులెన్స్ ప్రారంభిస్తున్న డాక్టర్ రవి కృష్ణ డాక్టర్,మధుసూదనరావు. చిత్రంలో సూర్యన్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నయన్ బాబా, డాక్టర్ సునీత్.**

# కొప్పుల ప్రసాద్ కి "అక్షర శ్రీ" విశిష్ట గౌరవ సత్కారం



**నంద్యాల ఆగస్టు 16 (రిపబ్లిక్ న్యూస్) :**

సమాజహితానికి, సాహిత్యానికి, సాంస్కృతిక రంగానికి అమూల్యమైన సేవలు అందిస్తున్న నంద్యాలకు చెందిన ప్రముఖ రచయిత కొప్పుల ప్రసాద్ కి జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ అయిన "విశ్వ సాహితీ కళావేదిక" ఆధ్వర్యంలో "అక్షర శ్రీ" విశిష్ట గౌరవ సత్కారాన్ని అందజేశారు.పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెంలో విశ్వ సాహితీ కళావేదిక ప్రథమ వార్షికోత్సవం (2026) సందర్భంగా నిర్వహించిన "విశ్వ సాహితీ అక్షర మహోత్సవం"లో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అక్షరాన్ని ఆరాధిస్తూ, ప్రతిభను ప్రోత్సహిస్తూ, సంస్కృతిని సంరక్షిస్తూ సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న మహనీయులను గుర్తించి ఈ గౌరవాన్ని అందించినట్లు సంస్థ ఛైర్మన్ కె. రామావతి తెలిపారు.ఈ సందర్భంగా కొప్పుల ప్రసాద్ మాట్లాడుతూ--- తెలుగు సాహిత్యానికి, భాషాభివృద్ధికి తాను చేస్తున్న సేవలను గుర్తించి "అక్షర శ్రీ" పురస్కారంతో సత్కరించిన విశ్వ సాహితీ కళావేదిక నిర్వాహకులకు, ఛైర్మన్ కె. రామావతి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా రచయిత కొప్పుల ప్రసాద్‌ను న్యూక్లియస్ కళాశాలల యాజమాన్యం శ్రీ మురళీధర్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, తెలుగు పండితులు అన్నెం శ్రీనివాస రెడ్డి, కవి నరేంద్ర, నీలం వేంకటేశ్వర్లు, కళారాధన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ, ప్రముఖ న్యాయవాది రామచంద్ర రావు, అంతర్జాతీయ శాస్త్రవేత్త రవీంద్రనాథ్ గార్లతో పాటు పలువురు కవులు, నంద్యాల పట్టణ ప్రముఖులు, సాహితీవేత్తలు మరియు మిత్రులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈర్నపాడు గ్రామంలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**అక్రమ మద్యం స్వాధీనం నంబర్ ప్లేట్లు లేని 10 ద్విచక్ర వాహనాల గుర్తింపు**





**నంద్యాల క్రైం, ఆగస్టు 16, (రిపబ్లిక్ న్యూస్):**జిల్లా వ్యాప్తంగా ముందస్తు నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఆదేశాల మేరకు, నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ శ్రీమతి సుస్మిత, సూచనలతో బండిఆత్మకూరు ఎస్సై జగన్మోహన్ తమ సిబ్బందితో కలిసి ఈర్నపాడు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తి వద్ద 10 క్వార్టర్ మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే నంబర్ ప్లేట్లు లేని సుమారు 10 ద్విచక్ర వాహనాలను గుర్తించారు. వాటికి సంబంధించిన వివరాలను పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం గ్రామ ప్రజలతో అవగాహన సమావేశం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, సైబర్ నేరాలు, లోన్ యాప్ మోసాలు తదితర వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు, ఓటిపిలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదని తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని సూచించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించి, నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను గుర్తించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, జిల్లాలో నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజల భద్రత కోసం ఇటువంటి కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com